www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -178 సోమవారం 29 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545



# విజయ తిలకం

## ఆసియా కప్ మనదే.. - తిలక్ వర్మ అదరహో...



- ఆసియా కప్ 2025 ఫైనల్లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం
- 5 వికెట్ల తేడాతో గెలిచి ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా
- నాలుగు వికెట్లతో పాక్‌ను దెబ్బతీసిన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్
- అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన తిలక్ వర్మ
- కీలక సమయంలో రాణించిన శివమ్ దూబే
- దుబాయ్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్

2లో.

ఆసియా కప్ 2025లో భారత జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో టీమిండియా అద్భుత విజయం సాధించింది. బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్ మాయాజాలం చేయగా, బ్యాటింగ్‌లో యువ ఆటగాడు తిలక్ వర్మ అజేయ హాఫ్ సెంచరీతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 147 పరుగుల ఛేజింగ్ లో టీమిండియా 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసింది.



# ట్రూడౌన్ ప్రకటించిన కూటమి సర్కారు

## ఏపీలో తగ్గనున్న విద్యుత్ ఛార్జీలు

గత ప్రభుత్వ హయాంలో పెంచిన ఛార్జీలను తిరిగివ్వనున్న విద్యుత్ శాఖ

నవంబర్ నెల నుంచి వచ్చే ఏడాది అక్టోబర్ వరకు మినహాయింపు చేయనున్న సిబ్బంది



**అమరావతి సెప్టెంబర్ 28,ప్రజావినికిడి**
ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ప్రభుత్వం మోపిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ట్రూఅప్ పేరుతో వైసీపీ ప్రభుత్వ హయాంలో వసూలు చేసిన సుమారు 923.55 కోట్లను ప్రస్తుతం మినహాయించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఏపీఈఆర్సీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

మిగతా 2లో.

# వైభవంగా గరుడ సేవ...

## రెండు లక్షల మంది హాజరు

మాడ వీధుల్లో పోటెత్తిన లక్షలాది భక్తజనం
ప్రత్యేకమైన లక్ష్మీహారం, మకరకంఠితో దర్శనమిచ్చిన మలయప్ప స్వామి
గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల గిరులు



2లో.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు..

## - ముగ్గురు మావోయిస్టులు మృతి



**రాయ్‌పూర్, సెప్టెంబర్ 28,ప్రజావినికిడి** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో తుపాకులు గర్జించాయి. చింద్‌ఖేడ్ అటవీ ప్రాంతంలో తూటాల వర్షం కురిసింది. భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురుకాల్పులు సంభవించాయి. ఈ ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఎదురుకాల్పులు కాంకేర్ ఎస్పీ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ జరిగింది. ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# ఆరోగ్యం జాగ్రత్త ..!

## అస్వస్థతతో ఉన్న పవన్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

- వైరల్ జ్వరం, దీర్ఘకాలిక బ్రాంకైటిస్‌తో బాధపడుతున్నట్లు వివరించిన ఉప ముఖ్యమంత్రి
- మెగా డీఎస్సీపై సీఎంకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు
- ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కార్యక్రమంపై మధ్య చర్చ
- ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన్కో, రోడ్ షోపైనా మంతనాలు
- ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పవన్‌కు సూచన



**హైదరాబాద్ సెప్టెంబర్ 28,ప్రజావినికిడి**
ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. వైరల్ జ్వరంతో బాధపడుతున్న పవన్‌ను ఆయన హైదరాబాద్ లోని నివాసంలో ఆదివారం మధ్యాహ్నం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జ్వరం తీవ్రత తగ్గిందని, అయితే ఎడతెరిపి లేకుండా వస్తున్న దగ్గు ఇబ్బంది పెడుతోందని పవన్ ముఖ్యమంత్రికి వివరించారు. వైద్య పరీక్షల అనంతరం, దీర్ఘకాలిక బ్రాంకైటిస్ కారణంగానే దగ్గు, గొంతు నొప్పి వస్తున్నట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.

మిగతా 2లో.



# ఆ రోజు అందరూ ఖాదీ వస్త్రాలే ధరించండి..

## - 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28,ప్రజావినికిడి** ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్ ' లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయంసమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని అన్నారు.దేశ స్వయంసమృద్ధి కోసం స్వదేశీ తయారీ

# భూములు గుంజుకోం.. రైతులను మెప్పిస్తాం

## భారత్ ఫ్యూచర్ సిటీ మీర్‌ఖాన్‌పేటలో

## ఎఫ్‌సీడీఏ భవనాలు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు : శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి

- ఫ్యూచర్ సిటీని న్యూయార్క్‌కు దీటుగా తీర్చిదిద్దుతా
- భాగ్యనగరం నుంచి బందర్‌పోర్ట్‌కు గ్రీన్‌ఫీల్డ్ రహదారి
- చెన్నై, బెంగళూరు నగరాలకు బుల్లెట్ రైళ్లు
- సింగరేణి కార్పొరేషన్ కు పదెకరాలు కేటాయింపు
- 2026 డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి

రంగారెడ్డి **సెప్టెంబర్ 28,ప్రజావినికిడి**
"రైతుల నుంచి అప్పనంగా భూములు లాక్కోం.. రైతులను ఒప్పించి, మెప్పించి ముందుకు వెళ్తాం. మీ తాతల ఆస్తులు గుంజుకునే ఆలోచన నాకు లేదు. భూమి విలువ ఏంటో, రైతు బాధలు ఏంటో అర్థం చేసుకునే వాడిని నేను.



మిగతా 2లో.

# నల్లమల్ల పులి కాదు..పిల్లి

## : అచ్చంపేట 'జన గర్జన' సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

- ఆల్మట్టి ఎత్తు పెంచుతుంటే సీఎం ఇంట్లో దాక్కున్నారా?
- పదవి కాపాడుకోవడానికే కర్నాటక కుట్రలపై మౌనం
- కాంగ్రెస్, బీజేపీది జాయింట్ వెంచర్ ప్రభుత్వం
- స్థానిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను బొందపెట్టాలి

మహబూబ్‌నగర్ **సెప్టెంబర్ 28,ప్రజావినికిడి**
ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి పాలమూరును ఎడారిగా మార్చే కర్నాటక కాంగ్రెస్ కుట్రలను అడ్డుకోకుండా నల్లమల్ల పులి అని చెప్పుకొనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పిల్లిలాగా ఇంట్లో కూర్చున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. రూ.70వేల కోట్లతో ఆల్మట్టి డ్యామ్ ఎత్తును మరో ఐదు మీటర్లు పెంచే కర్నాటక కుట్ర ఫలిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చుక్క కృష్ణా నీరు కూడా రాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆల్మట్టి నిర్మాణాన్నే ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన 'బీఆర్ఎస్ జన గర్జన' సభలో కేటీఆర్ మాట్లాడారు.

మిగతా 2లో.



# విజయ తిలకం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28,ప్రజావినికిడి

147 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ (5), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1), శుభ్‌మన్ గిల్ (12) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో తిలక్ వర్మ (69 నాటౌట్), సంజూ శాంసన్ (24)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. శాంసన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే (33)తో కలిసి తిలక్ వర్మ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దూబే కేవలం 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో వేగంగా ఆడి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు.

చివర్లో దూబే ఔటైనా, తిలక్ వర్మ సంయమనంతో ఆడి జట్టును గెలిపించాడు. పాక్ సీనియర్ పేసర్ హరీస్ రవూఫ్ విసిరిన చివరి ఓవర్లో టీమిండియా విజయానికి 10 పరుగులు అవసరం కాగా... తిలక్ వర్మ ఓ సిక్సర్ కొట్టడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. రింకూ సింగ్ విన్నింగ్ షాట్ గా ఫోర్




కొట్టడంతో భారత్ టోర్నీ విజేతగా అవతరించింది. అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్... పాకిస్థాన్‌ను కట్టడి చేసింది. పాక్ ఓపెనర్లు సాహిబ్జాదా ఫర్హాన్ (57), ఫఖర్ జమాన్ (46) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 4 ఓవర్లలో 30 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి పాక్ పతనాన్ని శాసించాడు. అతనికి తోడుగా జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండు వికెట్లు తీయడంతో పాకిస్థాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శన, ఆ తర్వాత తిలక్ వర్మ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో టీమిండియా ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది. భారత్ ఆసియా కప్ గెలవడం ఇది 9వ సారి కావడం విశేషం.కాగా, ఈసారి ఆసియా కప్ లో భారత్, పాకిస్థాన్ జట్లు మూడు సార్లు తలపడగా, అన్నింటా భారత జట్టే విజయం సాధించింది. ఆసియా కప్ చరిత్రలో భారత్-పాక్ జట్లు ఫైనల్ లో తలపడడం ఇదే మొదటిసారి కాగా, భారత్ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

# భూములు గుంజుకోం.. రైతులను మెప్పిస్తాం

(మొదటి పేజి తరువాయి)

బాధితులకు పూర్తిగా న్యాయం చేసిన తర్వాతే భూములు తీసుకుం టాం' అని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. డిసెంబర్‌లో యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించుకోబో తున్నామని, ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి పనులను ఇక్కడి నుంచే సమీక్షించబోతున్నామని తెలిపారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట వేదికగా ఎఫ్‌సీడీఏ భవనం సహా రావిర్యాల నుంచి ఆమనగల్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్లకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. 'ఇక సచివాలయంలో కాకుండా 'ఫ్యూచర్‌సిటీ ఆఫీసులో కూర్చొంటా.. నెలకు మూడు సార్లు ఇక్కడే ఉంటా' అని సీఎం తెలిపారు. పెట్టుబ డిదారులనే కాదు.. మొత్తం ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తానని, ఏ అభివృద్ధి కార్యక్రమమైె నా ఇకపై ఇక్కడి నుంచే చేపడుతానని చెప్పారు.

తనతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి కూడా నెలకు నాలుగు సార్లు ఇక్కడికి వచ్చి తన కార్యకలాపాలను కొనసాగిస్తారన్నారు. సింగరే ణి సంస్థ కోసం 10 ఎకరాలు కేటాయించి, 2026 డిసెంబర్‌లోగా ఆఫీసును ప్రారంభించాల్సిం దిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయ దశమి మనకు విజయాలను చేకూరుస్తోందన్నారు. వాతావరణ శాఖ చెప్పినట్టు నాలుగైదు రోజుల నుంచి విపరీతమైన వర్షాల వల్ల ఎవరూ బయటికి వెళ్లలేదని, కానీ మంచి సంకల్పంతో చేపట్టిన 'నవ్య.. భవ్య.. భారత్ ఫ్యూచర్‌సిటీ' శంకుస్థాపన కోసం ఈ రోజు వర్షం సహకరించిందన్నారు. ఇక్కడ రేవంత్‌రెడ్డికి భూములున్నాయని ఆయన కోసమే నగరం కడుతున్నారంటూ చాలా మంది కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. భూములుంటే భూమి మీదే ఉంటుందని, రహస్యంగా దాచుకోవడానికి నా దగ్గరేమీ లేదని, దానికి రికార్డులు ఉంటాయని, తన గురించో.. తన సహచర మంత్రుల గురించో ఆలోచన చేయడం లేదని, తామంతా రేపటి తరాల కోసమే ఆలోచన చేస్తున్నామని సీఎం ఉద్ఘాటించారు.

436 ఏండ్ల క్రితం కులీకుతుబ్ షాహీ హైదరాబాద్ నగరానికి పునాదులు వేసినప్పుడు చెరువులు, నదుల్లో ఏ విధంగా చేపల సమూహం ఉండేదో.. అదే విధంగా హైదరాబాద్ విరజిల్లాలని ఆకాంక్షించారు. అలాగే, నిజాం నవాబ్ 226 ఏండ్ల క్రితం సికింద్రాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. ఆనాడు చంద్రబాబు, వైఎస్సార్ తమకెందుకు అనుకుని ఉంటే.. హైటెక్‌సిటీ, ఔటర్‌రింగ్‌రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వచ్చేవి కాదన్నారు. ఆనాటి నాయకుల ఆలోచన వల్లనే ఫార్మా, ఐటీ రంగంలో ప్రపంచంతో పోటీపడుతున్నామని తెలిపారు. న్యూయార్క్, జపాన్, సింగపూర్, దుబారు తరహాలో ఫ్యూచర్‌సిటీ గురించి గొప్పగా చెప్పుకునేలా తీర్చిదిద్దుతామన్నారు.

తమకు పదేండ్లు అవకాశం ఇస్తే.. న్యూయార్క్‌లో ఉన్నవాళ్లు కూడా ఫ్యూచర్ సిటీ గురించి గొప్పగా చెప్పుకునేలా అభివృద్ధి చేస్తామని స్పష్టంచేశారు. అలాగే, ఫ్యూచర్‌సిటీ నుంచి శ్రీశైలం వరకు 100 మీటర్ల రోడ్డు వేస్తున్నామని అన్నారు. ఇటు ఫ్యూచర్‌సిటీ నుంచి అటు బెంగళూరు వరకు రోడ్డు సహా బుల్లెట్ ట్రైన్ మంజూరు చేయించుకున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, ఈ కొరతను తీర్చేందుకు మచిలీపట్నం వరకు రోడ్డు వేస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. ఫ్యూచర్‌సిటీలో ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లు కూడా తొలగించి, యూజీ కేబుల్స్ వేయబోతున్నట్లు చెప్పారు.

'చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరించుకుందాం. కూర్చొని మాట్లాడుకుందాం.. లిబరల్‌గా పరిష్కార మార్గం చూపిస్తా.. అందరికీ న్యాయం చేస్తా, కోర్టు బయట కూర్చొని నష్టాన్ని పూడ్చుకుందాం' అని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు సూచించారు. కోర్టుకెళ్లి అడ్వకేట్లకు ఫీజులు చెల్లించి నష్టపోయే కంటే తానే స్వయంగా రైతులతో కూర్చొని చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జంగారెడ్డి, ఎమ్మెల్యేలు మాల్‌రెడ్డి రంగారెడ్డి, యాదయ్య, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి, చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణ, సిటీ డెవలప్‌మెంట్ కమిషనర్ శశాంక్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా గరుడ సేవ...

తిరుమల సెప్టెంబర్ 28,ప్రజావినికిడి

కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన ఆదివారం సాయంత్రం జరిగిన గరుడ వాహన సేవ అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా సాగింది. తన ప్రియ వాహనమైన గరుత్మంతునిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తున్న శ్రీ మలయప్ప స్వామి వారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి. సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమైన ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించిన భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు.బ్రహ్మోత్సవాలలో గరుడ సేవకు అత్యంత ప్రాముఖ్యత ఉండటంతో, దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకున్నారు. మాడ వీధుల్లోని గ్యాలరీలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. దాదాపు రెండు లక్షల మందికి పైగా భక్తులు గరుడ సేవను ప్రత్యక్షంగా వీక్షించినట్లు అంచనా. నందకం, రామ్‌బాగ్, లేపాక్షి కూడళ్లతో పాటు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు సైతం భక్తులతో నిండిపోయాయి. గరుత్మంతునిపై సర్వాలంకార భూషితుడై వస్తున్న తమ ఆరాధ్య దైవాన్ని చూసి భక్తులు ఆనంద భాష్పాలతో నీరాజనాలు పలికారు. గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారిపైకి కర్పూర హారతులను విసురుతూ తమ భక్తిని చాటుకున్నారు.

ఈ గరుడ సేవ రోజున మాత్రమే స్వామివారికి అలంకరించే అపురూపమైన ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏడాదికి ఒక్కసారి మాత్రమే మూలవిరాట్ నుంచి బయటకు తీసుకువచ్చే అత్యంత విలువైన లక్ష్మీహారం, మకరకంఠి వంటి ఆభరణాలను ఉత్సవమూర్తి అయిన మలయప్ప స్వామికి అలంకరించారు. ఈ దివ్యాభరణాల కాంతులతో శ్రీవారు మరింత శోభాయమానంగా దర్శనమిచ్చారు. అంతకుముందు ఉదయం, శ్రీవారు జగన్మోహిని అవతారంలో శృంగార రసాధి దేవతగా భక్తులను కటాక్షించారు. పక్కనే శ్రీకృష్ణుడు అభయహస్తంతో భక్తులకు అభయమిచ్చారు.

పురాణాల ప్రకారం, తన తల్లి వినతను దాస్యం నుంచి విడిపించేందుకు గరుత్మంతుడు దేవలోకం నుంచి అమృత భాండాన్ని తీసుకొచ్చాడు. మాతృమూర్తిపై




ఆయన చూపిన అచంచలమైన భక్తికి మెచ్చిన శ్రీమహావిష్ణువు, గరుత్మంతుడిని తన నిత్య వాహనంగా స్వీకరించారు. ఆ ఘట్టానికి ప్రతీకగా ఏటా బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన భద్రత, వైద్య, ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు.

# ఆరోగ్యం జాగ్రత్త ..!

(మొదటి పేజి తరువాయి)

పవన్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సమావేశంలో కేవలం ఆరోగ్య విషయాలే కాకుండా, రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా ఒకేసారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించడంపై పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ నియామక పత్రాలు అందించే కార్యక్రమం ద్వారా యువతలో గొప్ప మనోధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారని అన్నారు.అనంతరం, అక్టోబర్ 4న విజయవాడలో నిర్వహించనున్న 'ఆటో డ్రైవర్ల సేవలో...' కార్యక్రమం గురించి చర్చించారు. 'స్త్రీ శక్తి' పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఆటో డ్రైవర్లు నష్టపోకూడదనే ఉద్దేశంతో, వారికి రూ.15,000 ఆర్థిక భరోసా అందించే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చంద్రబాబు వివరించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం కచ్చితంగా అందరి మన్ననలు పొందుతుందని పవన్ విశ్వాసం వ్యక్తం చేశారు.అదేవిధంగా, అక్టోబర్ 16న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయడంపై కూడా ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రోడ్ షో ప్రణాళికల గురించి కూడా ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చింది.

# ట్రూడౌన్ ప్రకటించిన కూటమి సర్కారు

(మొదటి పేజి తరువాయి)

దీంతో నవంబర్ నెల నుంచి వచ్చే ఏడాది అక్టోబర్ వరకు విద్యుత్ బిల్లుల భారం తగ్గనుంది.

గత ఐదేళ్లలో ట్రూఅప్ పేరుతో విద్యుత్ ఛార్జీల బాదుడే తెలిసిన వినియోగదారులకు కూటమి ప్రభుత్వం ట్రూడౌన్ (ఛార్జీల తగ్గింపు) ను పరిచయం చేస్తోందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను డిస్కంలు రూ.2,758.76 కోట్లకు ట్రూఅప్ కోసం దాఖలు చేయగా ఏపీఈఆర్సీ మాత్రం రూ.1,863.64 కోట్లకే ఆమోదం తెలిపింది.డిస్కంలు వినియోగదారుల నుంచి రూ. 2,787 కోట్లు వసూలు చేశాయి. దీంతో ఆ మొత్తం నుంచి రూ. 1,863.64 కోట్లను మినహాయించి మిగిలిన రూ. 923.55 కోట్లను వినియోగదారులకు తిరిగి చెల్లించాలని ఏపీఈఆర్సీ ఆదేశించింది. దీంతో ఈ మొత్తాన్ని ట్రూడౌన్ ఛార్జీల రూపంలో నవంబర్ నుంచి వచ్చే ఏడాది అనగా 2026 అక్టోబర్ వచ్చే విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చేస్తారు. దీని వల్ల యూనిట్‌కు 13 పైసలు చొప్పున వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది.

**ట్రూఅప్.. ట్రూడౌన్..**

ట్రూఅప్ అంటే ఛార్జీల పెంపు అయితే.. ట్రూడౌన్ అంటే ఛార్జీల తగ్గింపు. వినియోగదారుల నుంచి ట్రూఅప్ పేరుతో వసూలు చేసిన మొత్తం కన్నా తక్కువ ఖర్చు అయితే.. డిస్కంల దగ్గర నుంచి ఆ మిగిలిన మొత్తాన్ని వసూలు చేసి వినియోగదారులకు సర్దుబాటు చేయడాన్నే ట్రూడౌన్ అంటారు.

# ఆ రోజు అందరూ ఖాదీ వస్త్రాలే ధరించండి..

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తులనే విక్రయించాలని ప్రధాని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్‌కీ బాత్ 126వ ఎపిసోడ్‌లో భాగంగా ప్రజలను ఉద్దేశించి ఆయన ఆలిండియా రేడియోలో మాట్లాడారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని కోరారు.మహాత్మాగాంధీ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించారని ప్రధాని తెలిపారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ గత 11 ఏండ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని చెప్పారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని, కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని అన్నారు.

# బిహార్, మరో 7 రాష్ట్రాలకు 470 మంది పరిశీలకులను నియమించిన ఈసీ

సెప్టెంబర్ 28,ప్రజావినికిడి బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, మరో ఏడు అసెంబ్లీ ఉప ఎన్నికలకు జనరల్, పోలీస్, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులుగా 470 మంది అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారంనాడు నియమించింది. ఎన్నికలు సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేలా అధికారులు తమ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. 470 మంది అధికారుల్లో 320 మంది ఐఏఎస్‌లు, 60 మంది ఐపీఎస్‌లు, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్, ఐసీఏఎస్ సర్వీసులకు చెందిన వారు ఉన్నారుఎన్నికల పరిశీలకులు బిహార్‌లోని నియోజకవర్గాలతోపాటు బుద్గాం, నగ్రోటా (జమ్మూ అండ్ కశ్మీర్), అంతా (రాజస్థాన్), ఘాట్‌సిలా (జారా?ండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), తరన్ తారన్ (పంజాబ్), డంపా (జార?ండ్), నువాపడా (ఒడిశా)లో పని చేయనున్నారు. రాజ్యాంగ నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు పరిశీలకులు సహకరిస్తారని, ఎప్పటికప్పుడు కమిషన్‌కు రిపోర్ట్ చేస్తుంటారని ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల్లో తమకున్న సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో ఎన్నికల సజావుగా జరిగేందుకు వీరంతా ఈసీకి సహకరిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించామని పేర్కొంది.రాజ్యాంగంలోని 324వ నిబంధన, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 20బి కింద తమకు లభించిన ప్లీనరీ పవర్స్‌తో పరిశీలకులను నియమించినట్టు ఈసీ తెలిపింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఈసీ పర్యవేక్షణ, క్రమశిక్షణ కింద వీరు పనిచేస్తారని వివరించింది.

# గ్రూప్-2 తుది ఫలితాలు విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 28,ప్రజావినికిడి తెలంగాణలో గ్రూప్-2 తుది ఫలితాలు విడుదలయ్యా యి. తుది ఫలితాల జీఆర్ఎల్‌ను టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం విడుదల చేశారు. మొత్తం 18 రకాల పోస్టులకు సంబంధించి.. ఎంపికైన వారి జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. 783 పోస్టులకు గానూ 782 పోస్టులకు ఎంపికైన వారి జాబితా ను ప్రకటించింది టీజీపీఎస్సీ. ఒక వెకెన్సీని విత్ హెల్డ్‌లో పెట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

# నల్లమల్ల పులి కాదు..పిల్లి

(మొదటి పేజి తరువాయి)

ఆల్మట్టి ఎత్తు పెరిగితే కొడంగల్ లిఫ్ట్, పాలమూరు ఎత్తిపోతలు, శ్రీశైలం డ్యామ్ నిరుపయోగంగా మారతాయన్నారు. దక్షిణ తెలంగాణను ఎండబెట్టే కుట్రలపై ఢిల్లీలో రాహుల్ గాంధీ, ఇక్కడ రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.సీఎం పదవి కాపాడుకునేందుకే రేవంత్ మౌనంగా ఉన్నారని చెప్పారు. ఏ రోజుకైనా తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడేది ఒక్క కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కర్నాటక ముఖ్యమంత్రిని ఢిల్లీకి పిలిపించి రాహుల్ గాంధీతో మాట్లాడించి, ఆల్మట్టి ఎత్తు పెంపును ఆపించాలని సవాల్ విసిరారు. లేదంటే గులాబీ దండే స్వయంగా వెళ్లి అడ్డుకుంటుందని హెచ్చరించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందన్న అక్కసుతో బీఆర్ఎస్ హయాంలో 90శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ పక్కనపెట్టిందని విమర్శించారు. ఆ ప్రాజెక్టుతో ఏ సంబంధం లేని జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 70వేల ఎకరాలకు నీళ్లిచ్చేందుకు రూ.1350 కోట్లతో అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేశామని, అచ్చంపేట బిడ్డ అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి ఆ పథకాన్ని పూర్తి చేయకుండా పక్కన పెట్టారని ఆరోపించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలోని ప్రతి వర్గాన్ని దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ దోఖాను ప్రజలకు గుర్తుచేయడానికే 'కాంగ్రెస్ బకాయి కార్డు' ఉద్యమాన్ని ప్రారంభిం చామని అన్నారు. ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నేతలను ప్రజలు ఈ బాకీ



కార్డు చూపించి నిలదీయాలని, ఇదే ప్రజల చేతుల్లోని బ్రహ్మాస్త్రమని తెలిపారు. రియల్ ఎస్టేట్ దందాలతో వందల కోట్లు సంపాదిస్తున్న కాంగ్రెస్ నేతలు ఓటుకు రూ.5వేలు ఇచ్చినా, బాకీ డబ్బులు ఎప్పుడు ఇస్తారని నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు డబ్బులిచ్చి ప్రమాణాలు చేయించినా, ఉత్తుత్తి ప్రమాణాలు చేసి కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యూరియా ఇవ్వకుండా, రైతుబంధు వేయకుండా, వడ్లకు బోనస్ ప్రకటించకుండా రేవంత్‌రెడ్డి రైతులను అరిగోస పెడుతున్నారని విమర్శించారు.తెలంగాణలో నడుస్తున్నది కాంగ్రెస్-బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వమని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. గతేడాది సెప్టెంబర్ 27న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడుల్లో నోట్ల కట్టలు దొరికాయని ప్రచారం చేశారని, కానీ ఆయన కాంగ్రెస్‌లో చేరి, ఏడాది గడిచినా ఈడీ నోరు మెదపడం లేదని, ఇదే వారి అవగాహనకు నిదర్శనమన్నారు. ఈ రెండు పార్టీలను స్థానిక సంస్థల ఎన్నికల్లో బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం దివాలా తీసిందని చెబుతూ తెలంగాణ పరువును బజారుకీడుస్తున్నారని, హామీలపై నిలదీస్తే 'నన్ను కోసుకు తింటారా?' అని మాట్లాడటం దారుణమన్నారు. అచ్చంపేటలో ఎవరో పార్టీ వీడారని బాధపడాల్సిన అవసరం లేదని, ప్రజల అభిమానం ఉన్న నాయకుడిని కేసీఆర్ త్వరలోనే పంపిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
సోమవారం 29 సెప్టెంబర్ 2025

## పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జిఎంఆర్..



**ప్రజావినికిడి,(సంగారెడ్డి):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట మైత్రి విల్లాస్ కాలనీలో ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీటి నల్ల కనెక్షన్లను ప్రారంభించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి.హాజరైన అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం,మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్,మాజీ సర్పంచ్ కృష్ణ,మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వెంకట్ రెడ్డి,దశరథ్ రెడ్డి,రాజు,శ్రీకాంత్, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 15 మంది దివ్యాంగులకు త్రి చక్ర సైకిళ్ళను పంపిణీ చేసిన జీఎంఆర్..



**ప్రజావినికిడి,(సంగారెడ్డి):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో డొనేట్ కార్ట్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 15 మంది దివ్యాంగులకు త్రి చక్ర సైకిళ్ళను పంపిణీ చేసిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి,డొనేట్ కార్ట్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్,మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ జ్యోతి రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు,మాజీ కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## అమీన్పూర్ లో మూడు కోట్ల 23 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్




**ప్రజావినికిడి,(అమీన్పూర్):** అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము,టైలర్స్ కాలనీ, వందనాపురి కాలనీ, సృజన లక్ష్మీ నగర్ కాలనీ,మల్లికార్జున హిల్స్ కాలనీలలో మూడు కోట్ల 23 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యు జి డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.హాజరైన మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్,మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కాలనీ లో శ్రీ దుర్గాదేవి నవరాత్రులలో భాగంగా అన్నదాన కార్యక్రమం..





**ప్రజావినికిడి,(నాగోల్):**ఆదివారం రోజు నాగోల్ డివిజన్ పరిధిలోని దేవి రెడ్డి సుధీర్ రెడ్డి కాలనీ లో శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ హాజరై అన్నదాన కార్యక్రమంలోపాల్గొన్నారు.అలాగే సర్వే నెంబర్ 58 దేవి రెడ్డి సుధీర్ రెడ్డి నగర్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, జనరల్ సెక్రటరీ విష్ణు చారి,కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భరోసా హాస్పిటల్ డాక్టర్స్ దాండియా వేడుకలు..






**ప్రజావినికిడి ,(హైదరాబాద్):**
హైదరాబాద్ ఎల్బీ నగర్ తూర్పు హైదరాబాద్‌లోని వన్ కన్వెన్షన్ ఎల్బీనగర్ వేదికగా డా. డాండియా 2025 ఘనంగా,వైభవంగా జరిగింది.ఈ సాంస్కృతిక మహోత్సవాన్ని డా.నారి చారిటబుల్ ట్రస్ట్ స్థాపకురాలు డా. కీర్తనా అలాగే భరోసా హాస్పిటల్ సీఈవో డా. ఉదయ్ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.ఈ వేడుకలో సుమారు 1200 మంది ప్రేక్షకులు పాల్గొని సంగీతం, నృత్యం,సాంప్రదాయ ఉత్సాహంతో నిండిన సాయంత్రాన్ని ఆస్వాదించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినఎమ్మెల్యే సుధీర్ రెడ్డిమల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ వైస్ చైర్మన్ శ్రీమతి ప్రీతి రెడ్డిఎల్బీ నగర్ ఏసీపీ ఏ.కృష్ణయ్యప్రైమ్ 9 న్యూస్ సీఈఓ శ్రీ వెంకటేశ్వరరావు వారు పాల్గొని నిర్వాహకులను అభినందిస్తూ, ఈవెంట్‌ను శోభాయమానం చేశారు.

### కార్యక్రమ విశేషాలు

ఈవెంట్‌లో భాగంగా:డాక్టర్స్ డాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.బతుకమ్మ ద్వారా తెలంగాణ సాంప్రదాయం ప్రతిబింబించబడింది.భాంగ్రా అదేవిధంగా ఘుంచ్ నృత్యం ఉత్తర భారతీయ ఉత్సాహాన్ని వేదికపైకి తెచ్చాయి.ఫ్యాషన్ వాక్,లైవ్ డీజే,పాటలు,గార్బా వంటి విభిన్న అంశాలు ప్రేక్షకులను అలరించాయి.అతిథుల అభిప్రాయాలు
అతిథులు మాట్లాడుతూ,ఈవిధమైన సాంస్కృతిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, ఆనందాన్ని పెంచుతాయి.ప్రజల విస్తృత భాగస్వామ్యం ఈ వేడుకను మరింత స్మరణీయంగా మార్చింది అన్నారు.

### నిర్వాహకుల స్పందన

డా.కీర్తనా మాట్లాడుతూ,డా.నారి చారిటబుల్ ట్రస్ట్ తరపున మహిళా సాధికారత,సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రోత్సాహం అన్నింటినీ ముందుకు తీసుకెళ్తాం.ఆదివారంరోజు ప్రేక్షకుల నుంచి వచ్చిన ఆదరణ మాకు ప్రేరణ” అన్నారు.
డా.ఉదయ్ మాట్లాడుతూ,భరోసా హాస్పిటల్ కేవలం వైద్యసేవల్లోనే కాకుండా,సమాజానికి దగ్గరగా ఉండే కార్యక్రమాలను ప్రోత్సహించడం మా లక్ష్యం.భవిష్యత్తులో కూడా ఇలాంటి వేడుకలను నిర్వహిస్తాం” అని తెలిపారు.

### ముగింపు

ప్రేక్షకుల ఉత్సాహం, అతిథుల ప్రోత్సాహం, నిర్వాహకుల అంకితభావం కలసి డా.డాండియా 2025 ను తూర్పు హైదరాబాద్‌లో ఒక స్మరణీయ సాంస్కృతిక వేడుకగా నిలిపాయి అని వారు అన్నారు.

## ఆఫీసర్స్ కాలనీ అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణం కొరకు 34,00,000 లక్షల నిధులు మంజూరు చేయించినందుకు

## కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కి కాలనీ నివాసుల కృతజ్ఞతలు..

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ లో నూతన సిసి రోడ్ల నిర్మాణం కొరకు 34,00,000 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించినందుకు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం 34 లక్షలు నిధులు మంజూరు చేయించినందుకు కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.అలాగే కాలనీలో త్రాగునీటి సమస్య,దోమల బెడద ఎక్కువగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్



దృష్టికి తీసుకురావడం జరిగింది స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరిగింది అలాగే ఒకటి ఒకటిగా కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని కాలనీ వాసులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈకార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బాలాజీ
వైస్ ప్రెసిడెంట్ శ్రీ వెంకట్ బెజవాడ, పవిత్ర
జనరల్ సెక్రటరీ మహేష్ గుప్తా,జాయింట్ సెక్రటరీ శ్రీ యాదగిరి,డ్యూప్యూటీ జనరల్ సెక్రటరీ రాజశేఖర్,కోశాధికారి రఘుపతి రెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్ మోహన్, మోహన్ రెడ్డి,రాంచందర్ నాయుడు,శ్యామ్ లాల్,వీరస్వామి,ఎన్ఎన్వి శ్రీనివాస్ రమేష్ నాయుడు శ్రీ డి.యమ్.శ్రీనివాస్,బచ్చు శ్రీనివాస్,రమేష్, జలందర్ రెడ్డి కాలనీ మహిళలు తదితరులు ఉన్నారు.

## నియోజకవర్గ బీసీ సేన ఆధ్వర్యంలో సీనియర్ అడ్వకేట్ సబియా సుల్తానాకు ఘన సన్మానం






**ప్రజావినికిడి,(షాద్ నగర్):**నియోజకవర్గ బీసీ సేన ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం.షాద్ నగర్ సీనియర్ మహిళా అడ్వకేట్ సబియా సుల్తానా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం నియమితులైన సందర్భంగా,ఆమెకు శాలువా కప్పి ఘన సన్మానం అందజేశారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీసీ సేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప,అసెంబ్లీ నియోజకవర్గ యువజన అధ్యక్షులు పాలాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మేకల వెంకటేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి జయ శ్రీకాంత్,నియోజకవర్గ మహిళా అధ్యక్షులు బాస వరలక్ష్మి,నియోజకవర్గ బీసీ మహిళా ప్రధాన కార్యదర్శులు సౌజన్య,చెరుకు మమత తదితరులు పాల్గొన్నారు.అలాగే షాద్‌నగర్ టౌన్ బీసీ సేన అధ్యక్షులు తంగిడిపల్లి శంకర్, మహిళా అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మి గౌడ్,నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూషణం నరేష్, మహిళా ఉపాధ్యక్షురాలు అరుణ,సంపత్,విష్ణు చారి,సాయి తేజ తదితరులు హాజరై సబియా సుల్తానా కు శుభాకాంక్షలు తెలిపారు.

## బీసీలపై రెడ్డి జాగృతి సంస్థ కుట్ర

### షాద్ నగర్ లో బీసీ జేఏసీ నేతల నిరసన..

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నంబర్ 9 ను ప్రభుత్వం తీసుకొస్తే దాన్ని వ్యతిరేకిస్తూ రెడ్డి జాగృతి సంస్థ హై కోర్టులో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు తగ్గించాలని వేసిన పిటిషన్ ను వెనక్కి తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీసీ జేఏసీ బహుజన నేతలు ప్లక్ కార్డులు చెతపట్టుకొని రెడ్డి జాగృతి సంస్థ కు వ్యతిరేకంగా నినాదాలు ఈ సందర్భంగా బీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ, (ఈడబ్ల్యుసి) కోట పది శాతం విద్య ఉద్యోగాల్లో పెంచినప్పుడు దానిని బీసీలు ఎప్పుడూ కూడా వ్యతిరేకించలేదు కానీ కేవలం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయంపై రెడ్డి జాగృతి సంస్థ కోర్టుకు వెళ్ళడంలో అంతర్యం ఏమిటో తెలపాలని అన్నారు.వెంటనే ఆ పిటిషన్ ను వెనక్కి తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బిసిలకు విద్య ఉద్యోగాల్లో రాజకీయాలలో కూడా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.సమాజంలో రెండు వర్గాల మధ్య అలజడి సృష్టించే విధంగా పూనుకుంటున్న రెడ్డి జాగృతి సంస్థ ను పూర్తిగా నిషేధించాలని డిమాండ్




చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ బహుజన నేతలు టీజీ.శ్రీనివాస్ రవీంద్రనాథ్,అర్జునప్ప,నర్సింలు గౌడ్,కరుణాకర్,చంద్రశేఖరప్ప వెంకటేష్,శంకర్, శ్రీను, నర్సింలు నరేష్,రామలింగం,శేఖర్ గౌడ్,వలిగ కృష్ణ,బిజిలి సత్యం,తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో వారు కలలుగన్న సమ సమాజం కోసం యువత పాటుపడాలి..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణంలో గల భగత్ సింగ్ విగ్రహానికి టీఎస్ యుటిఎఫ్ అలాగే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలతో ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా టి ఎస్ యు టిఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ భారత స్వతంత్ర ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో నూనూగు మీసాల వయసులోనే భగత్ సింగ్ జలియన్ వాలాబాగ్ దురంతానికి చలించి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నాడు. వారు నవజీవన్ భారత సమితి అనే సంస్థను స్థాపించి దానిద్వారా అనేక వ్యాసాలు రాస్తూ విద్యార్థులను యువకులను రైతులను స్వాతంత్ర ఉద్యమం గురించి, స్వాతంత్ర అనంతరం ఏర్పడే ప్రభుత్వం ఎలాంటి ప్రభుత్వం ఉండాలో దాని గురించి ముందే ఆలోచించడం జరిగింది.అదేవిధంగా నేషనల్ కాలేజీలో చదివే క్రమంలో తన చదువుకు స్వస్తి చెప్పి గాంధీ చేపట్టిన సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. చౌరీ చౌర సంఘటనతో గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఆపివేయడం జరిగింది. దానితో భగత్ సింగ్ హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ ఆర్మీలో చేరడం జరిగింది.ఆ క్రమంలో తన మిత్రులైన చంద్రశేఖర్ ఆజాద్,రాంప్రసాద్ బిస్మిల్,రాజు గురు,సుఖదేవ్, బటకేశ్వర్ దత్, శివవర్మ లాంటి మిత్రులతో కలిసిపనిచేశాడు. సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో లాలా లజపతిరాయ్ బ్రిటిష్ పోలీసులు కొట్టిన దెబ్బలకు తీవ్రంగా గాయపడి మరణిస్తాడు.అందుకు ప్రతీకారంగా సాండర్స్ అనే పోలీస్ అధికారిని చంపడం జరిగింది. అనంతరం ఢిల్లీలోని నేషనల్ అసెంబ్లీలో భగత్ సింగ్,బటకేశ్వర్ దత్ లు పొగ బాంబులు వేసి బ్రిటిష్ వాళ్ళు తెస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలని రద్దు చేయాలని ఎర్రని కరపత్రాలు పంచడం జరిగింది.ఆ తరువాత బ్రిటిష్ వాళ్లు హెచ్ఎస్ఆర్ఏ పైన నిఘా పెట్టి వారి పైన కాన్పూర్,మీరట్, ఖకోరి లాంటి కుట్ర కేసులు పెట్టి భగత్ సింగ్ ను రాజ్ గురు సుఖదేవ్ లను అరెస్టు చేసి జైల్లో నిర్బంధించడం జరిగింది.జైల్లో కూడా ఖైదీల హక్కుల కోసం దాదాపుగా 56 రోజులు జైల్లో భగత్ సింగ్,రాజు గురు,సుఖదేవులు సమ్మె చేయడం జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వం వారికి ఉరిశిక్షను కరారు చేయడం జరిగింది. వారు మాతృదేశం కోసం చిరునవ్వుతో ఉరిశిక్షను స్వీకరించారే తప్ప క్షమాబిక్ష క్షమాభిక్ష కోరుకోలేదని అన్నారు.అలాంటి వీరుడి స్ఫూర్తితో నేడు మన దేశంలో అమలవుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యువత ఉద్యమించాలని భగత్ సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు,యూటీఫ్ నాయకులు జి.శివారెడ్డి,బిజిలి సత్యం,ఎల్.బాలయ్య, ఎల్.రాములు,పి.శేఖర్ గౌడ్,వలిగి కృష్ణ జేఏసీ నాయకులు యం.జనార్ధన్,తిరుమలయ్య,బీసీ జేఏసీ నాయకులు టీజీ.శ్రీనివాస్, కె.రవీంద్రనాథ్,యం.నర్సింలు, నక్కబాలరాజు,రాముగిరిజన సంఘం ఈశ్వర్,ఎస్ ఫ్ఐ శ్రీకాంత్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులకు,సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో ఉన్న జడ్పీ హై స్కూల్ నందు అదనపు తరగతి గదుల నిర్మాణానికి, పాత జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ పనులకు మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ నేతృత్వంలో పూజా కార్యక్రమంలో పాల్గొని పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.ఆదివారం ఉదయం మండల కేంద్రానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాగానే మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ మండల అధ్యక్షుడు జంగ నరసింహ స్వాగతం పలికారు.మండల కేంద్రంలో శివాజీ యూత్ దుర్గామాత సేవా సమితి సభ్యులు నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల దుర్గామాత మండపంలో మండల నేతలు,కార్యకర్తలు కలిసి ప్రత్యేక ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు.
అనంతరం పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు.పాత జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ,గత పాలకులు ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు చూశారని అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం
ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూల్ గదులను నిర్మిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి..

### ముఖ్యమంత్రి పట్టిన జెండా కాంగ్రెస్ ఎజెండా బిజెపి : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..





**ప్రజావినికిడి,(రంగారెడ్డి):**
రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,
స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉన్నందున కార్యకర్తలు సర్వం సిద్ధంగా ఉండాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు పూర్తిగా ప్రజలను మోసం చేసే విధంగా ఉందని విమర్శించారు. ఇచ్చిన హామీలను ఏవీ నెరవేర్చకుండా,కొత్త కొత్త పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని తెలిపారు.ప్రత్యేకంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన కాంగ్రెస్ బాకీ కార్డు ద్వారా ప్రతి గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మోసపూరిత పాలన గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.అలాగే ముఖ్యమంత్రి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామంటూ మోసం చేస్తున్నారని,ఇచ్చిన జీవో చెల్లదని తెలిసి కూడా బీసీలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు.ఎన్నికలు ఉన్నా లేకపోయినా మనం సిద్ధంగా ఉండాలి. మరల మన కేసిఆర్ నాయకత్వంలో స్థానిక సంస్థలపై రంగారెడ్డి జిల్లా అంతటా బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయాలి” అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ క్యామ మల్లేష్, రాజేంద్రనగర్ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, అవినాష్,గ్రంథాలయ చైర్మన్ వెంకటరమణారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గ అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..



**ప్రజావినికిడి,(దిల్ సూక్ నగర్):**దేవీ శరన్నవరాత్రి కార్యక్రమాల్లో భాగంగా దిల్ సుఖ్ నగర్ శ్రీ కనకదుర్గ అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఈ కార్యక్రమంలో కనకదుర్గ అమ్మవారి గుడి ఫౌండర్ చైర్మన్ రాంచందర్, చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు మహేష్ గౌడ్,మధు సాగర్, కిరణ్,రామకృష్ణ, కిషన్,సంతోష్, శివ,ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ గ్రామంలో దుర్గామాత మండపంలో పూజా అన్నప్రసాద కార్యక్రమం

### పాల్గొన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..

### మహిళ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు..






**ప్రజావినికిడి,(షాద్ నగర్):** షాద్ నగర్ నియోజకవర్గం లోని ఫరూక్నగర్ మండలంలో రాయికల్ గ్రామంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాత మండపాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజ అదేవిధంగా అన్నప్రసాద కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాడిపల్లి వెంకట్ రెడ్డి,మహిళా సంఘమ్ అధ్యక్షురాలు యశోద,నాయకులు జయంత్ రెడ్డి,యాదయ్య,విష్ణు గౌడ్,వెంకటేష్,జి వెంకటేష్,రాఘవేందర్ గౌడ్,జిల్లెల నవీన్ రెడ్డి,భాస్కర్ గౌడ్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలి..

### మహిళా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేయాలి..

### చౌదర్ గూడ గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్..



**ప్రజావినికిడి,(శంషాబాద్):**రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని చౌదర్ గూడ గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు శంషాబాద్ తాళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డు కలిగి ఉండి 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రభుత్వం ఇచ్చే చీరలలో మహిళలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.గతంలో ప్రతి మహిళకు చీరలను పంపిణీ చేశారని దసరా కానుక మహిళలు చీరల కోసం ఎదురుచూస్తున్నారని మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కృషి చేయాలని మహిళా సంక్షేమ ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

## లండన్ లో కవిత కు ఘన స్వాగతం..





**ప్రజావినికిడి,(హైదరాబాద్):**లండన్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కు ఘన స్వాగతంతెలంగాణ జాగృతి యూకే శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ సంబురాల్లో పాల్గొనేందుకు ఆదివారం లండన్ కు చేరుకున్న కవిత ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికిన జాగృతి నాయకులు..

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ దుర్గ దేవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన చిలుక ఉపేందర్ రెడ్డి..



**ప్రజావినికిడి,(ఆర్కేపురం): ప్రతినిధి,సెప్టెంబర్ 28,**
ఆర్కే పురం డివిజన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ చౌరస్తాలో నవ దుర్గ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దవూర సైదులు,లింగా స్వామి గౌడ్,వెంకట్ రమణ రెడ్డి(రాజు),మామిడి రామకృష్ణ గౌడ్,రఘు, విప్లవ్,అసోసియేషన్ సభ్యులు కానుగుల వీరేష్,నాగురి లింగం, కరింగ నరేష్,శ్రవణ్, పగిళ్ల గణేశ్,రాకేష్, మణికంఠ,చిన్న,రమేష్ గౌడ్(బాలు), దినేష్,మున్నా,సాయి, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలి..

**టిపిసిసి ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అదేవిధంగా రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త..**





**ప్రజావినికిడి,(నాగోల్):**అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అని టి పి సి సి ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అలాగే రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.శనివారం నాగోల్ లోని శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం లో దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న,కుమారుడు సాయి కిరణ్ కోడలు శార్వారీ,చిన్న కుమారుడు సాయి తేజ అలాగే కన్న గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నేటి నుంచి విచారణ

హైదరాబాద్ః **సెప్టెంబర్ 28,ప్రజావినికిడి** పార్టీ ఫిరాయించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం నుంచి విచారణ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఆవరణలో అధికారులు ఆంక్షలు విధించారు. అసెంబ్లీ ఆవరణలోకి అనుమతి లేకుండా సందర్శకులు, మీడియా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు రావద్దని తెలిపారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద ఎవరూ మాట్లాడరాదని సూచిస్తూ బులిటెన్ విడుదల చేశారు. ఇదిలాఉండగా సోమవారం ఉదయం 11 గంటలకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే బి. ప్రకాష్ గౌడ్ అనర్హత పిటిషన్‌పై విచారణ ప్రారంభమవుతుంది. పన్నెండు గంటలకు ఎమ్మెల్యే కాలె యాదయ్య, మధ్యాహ్నం ఒంటి గంటకు గూడెం మహిపాల్ రెడ్డి, మూడు గంటలకు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అనర్హత పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టనున్నారు. తమ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినందున పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌ను కోరుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో స్పీకర్ సోమవారం నుంచి విచారణ ప్రారంభించనున్నందున అసెంబ్లీ ఆవరణలో ఆంక్షలు మరింత కట్టుదిట్టం చేశారు.

## శాంతించిన మూసీ



హైదరాబాద్ః **సెప్టెంబర్ 28,ప్రజావినికిడి** గ్రేటర్ హైదరాబాద్‌లో మూసీనది శాంతించింది. గత రెండు రోజులు కంటిమీద కునుకులేకుండా చేసిన మూసీనది.. ఆదివారం సాయంత్రానికి వరద ఉధృతి తగ్గింది. తగ్గిన వరద ఉధృతి.. ఊపిరి పీల్చుకున్న జనం పునరావాస కేంద్రాల్లోంచి తిరిగి ఇళ్లలోకి బాధితులు ఎంజిబిఎస్ నుంచి బస్సుల రాకపోకలు పునరుద్ధరణ వ్యర్థాలను తొలగిస్తున్న జిహెచ్ఎంసి సిబ్బంది మన తెలంగాణ/సిటీ బ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో మూసీనది శాంతించింది. గత రెండు రోజులు కంటిమీద కునుకులేకుండా చేసిన మూసీనది.. ఆదివారం సాయంత్రానికి వరద ఉధృతి తగ్గింది. తవ్ర వత్తిడికి గురిచేసిన, ఆందోళనకు కారణమైన మూసీనది వరదలు ఎట్టకేలకు సాదారణ స్థితికి చే రాయి. ఈ వరదలతో ఏలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అధికార యం త్రాంగం కాస్త ఊపిరి పీల్చుకుంది. ఎంజీబిఎస్ నుండి బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. చాదర్‌ఘాట్ లోయర్ బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని గ్రేట ర్ అధికారులు గుర్తించారు. వాహనాలకు అనుమతించలేదు. బస్తీల్లోకి చేరిన బురద, వరదల్లో కొట్టుకొచ్చిన వ్యర్థాలను, చెట్లను తొలగించడంపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. మూసీనది వరదల ప్రాంతాల్లో జీహెచ్ఎంసి అధికారులు ఆదివారం పరిశీలించారు. చేపట్టాల్సిన చర్యలను మొదలుపెట్టారు. బ్రిడ్జీల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు, కొట్టుకొచ్చిన చెట్లు, ఇతర వస్తువులను తొలగించడం షురూ చేశారు.

## శక్తి స్వరూపిణి శ్రీ అంభా భవాని మాత అశీసులు భక్తులు అందరి పైన ఉండాలి..

**శ్రీ అంబా భవాని మాత అభిషేక పూజలో పాల్గొన్న బిజెపి నేతలు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,అందే బాబయ్య**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలంలోని శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఎలికట్ట శ్రీ అంబా భవాని క్షేత్రంలో అభిషేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,అందే బాబయ్య,ప్యాట అశోక్ శ్రీనివాసచారి, మదన్,మల్చలం రాము,పిట్టల సురేష్,వెంకటేష్, శివకృష్ణ,పద్మ కృష్ణయ్య,ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రాజు,ఎంపీటీసీ శ్రీశైలం,ఆర్ల యాదయ్య,మాజీ సర్పంచ్ సాయి కుమార్ యాదవ్,నరేష్, ఆలయ కమిటీ మెంబర్లు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు ఘనముగా స్వాగతించి సన్మానించారు అమ్మవారి కృప కటాక్షాలకు పాత్రులైన భక్తులను ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో చూడాలని అమ్మ వారిని కోరుకున్నారు.అమ్మ వారి కృపతో ఈ ప్రాంతం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుందని అని అన్నారు.భవాని మాత ఆలయం అతి పురాతన ఆలయము అని,ఆలయ అభివృద్ధి కి దాతల సహకారము తో పాటు ప్రభుత్వం సహకారం అందుతే ఇంకా భక్తులకు మెరుగైన సౌకర్యం అందుతుందని అన్నారు.

## చెర్ల కొండాపూర్లో కోటి 86లక్షలతో డాంబర్ రోడ్ నిర్మాణంకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**రాయికల్ సెప్టెంబర్ 28,ప్రజావినికిడి**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చర్ల కొండాపూర్ లో కోటి 86 లక్షలతో దాంబర్ రోడ్డు కు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు

ఈ సందర్భంగా గ్రామస్తులు మహిళలు మేళతాళాలతో ఎదురుకా రావాడమ్ విశేషం

ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఏమైనా చెర్ల కొండాపూర్ గ్రామ ప్రజలు నన్ను గెలిపించి నందుకు మీరుణాన్ని తీర్చుకున్నాను ఆరోజు మీరు గెలిపించడం వల్ల మీరు రుణాన్ని ఈ విధంగా తీర్చుకుంటానని నేను అనుకోలేదని ఈ రోడ్డు ద్వారా మీరుణము తీర్చుకున్నట్టు అయిందని ఆయన అన్నారు చర్ల కొండాపూర్ గ్రామానికి ఇంకా నేను బాకీ ఉన్నానాని అలాగే గ్రామస్తుల కోరిక పై బతుకమ్మ ఘాట్ కట్టాలని ఆడపడుచులు అడగాగా దాన్ని కూడా వచ్చే బతుకమ్మ లోపు తప్పనిసరిగా వారి కోరిక నెరవేస్తానాని ఈ సందర్భంగా అన్నారు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దేవుని రవి మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం షికారి విశ్వనాథం రోడ్డు చేయించాడని అప్పుడు నేను జగిత్యాల చదువుకుని కొండాపురం వచ్చేవాడిని మా తల్లి దేవుని నర్సమ్మ సర్పంచ్ గా ఉండే శికరివిశ్వనాదాము వల్ల రోడ్ నిర్మించారని అలాంటిది ఇప్పుడు ఏకంగా డ%శీ%బర్ రోడ్డు ఎమ్మెల్యే అలా అలా సంజయ్ కుమార్ ఒక కోటి 86 లక్షలు మంజూరు ఇచ్చి శంకుస్థాపన చేయించడం



మా గ్రామ ప్రజల అదృష్టంగా భావిస్తున్నానని రవి అన్నాడు మాకు రోడ్డు సౌకర్యం లేక మేము చాలా బాధపడ్డామని ఆ రోడ్డు నుండి నడువా లేకపోతున్నామని అదికాక చెర్లకొండాపూర్ పల్లెలో నాగులమ్మ దేవాలయాముకు 200 మీటర్ల సిమెంట్ రోడ్డు చేయించాలని దేవుని రవి అడగగా దానికి సంజయ్ కుమార్ ఒప్పుకోవాలని గ్రామస్తులు తరఫున ఆయన వినిపించారు ఇదిలా ఉండగా రాయికల్ గ్రామంలో చెర్లకొండపూర్ గ్రామంలో సిమెంట్ రోడ్లు అన్ని వాడల్లో కాలేదని దేశవేని రాజు ఇంటి నుండి పడాల రాజు ఇంటి వరకు సిమెంట్ రోడ్డు అలాగే మురికికి కాలువలు నిర్మించాలని బెల్లల లచ్చక్క ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా దాని గురించి ప్రయత్నిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రాయికల్ మున్సిపాల్ మాజీ చైర్మన్ మొర హన్మాండ్లు మాట్లాడుతూ “”చేర్ల కొండాపూర్ గ్రామము ఈశాన్యంలో చెరువు ఉండటం వల్ల ధనిక గ్రామమని అలాగే అంతర్గామా గ్రామానికి చెరువు ఈశాన్యంలో ఉండగా అక్కడ రాజకీయ నాయకులు “”ఎక్కువగా ఉన్నారాని ఈ సందర్భంగా ఆయన చమత్కరించారు అధికారులు మండల ప్రజా పరిషత్ అధికారి బింగి చిరంజీవి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిలాంద్ రాయికల్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రసాద్ రాయికల్ తాసిల్ ఆఫీస్ నుండి గిరిధవార్లు దాసరి పద్మయ్య బద్ది దేవదాస్ హాజరయ్యారు

ఈ కార్యక్రమంలో రాయికల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు సింగిల్ విండో అధ్యక్షులు ఏన్గుమల్లారెడ్డి బెజ్జంకి మోహన్ రామజిపేట మీనుగు అంజయ్య కొత్తపేట్ రాయికల్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జోగిన్ పల్లి తిరుపతి గౌడ్ అధ్యక్షులు గన్నే రాజిరెడ్డి బోర్నాపెల్లి శ్రీనివాస్ మాజీ సింగల్ విండో అధ్యక్షులు పడిగేలా రవీందర్ రెడ్డి గ్రామ మాజీ సర్పంచులు ఆర్మూర్ లక్ష్మీనారాయణ అల్లకొండ సుదర్శన్ ఆకుల లక్ష్మీనారాయణ మాజీ ఉపసర్పంచ్ ఏషాలా సాయిరెడ్డి మహిళా మండలిఅధ్యక్షురాలు మామి%శీ%డ్ల భాగ్యలక్ష్మి పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు మహిళలు హాజరయ్యారు

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో విశిష్ట వ్యక్తులకు సన్మానం

**తాండూరు సెప్టెంబర్ 28,ప్రజావినికిడి**
సమాజంలో విశిష్ట వ్యక్తులను గుర్తించి, వారందరినీ ఒకే వేదిక పైకి తీసుకుని దేశ అభివృద్ధి ప్రగతి పథంలో బాకస్వామ్యం చేయాలని సంకల్పమే బిజెపి లక్ష్యమని రాష్ట్ర, జిల్లా బిజెపి నేతలు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు దేశ ప్రధానమంత్రి మోడీ జన్మదిన ఉత్సవాలలో భాగంగా పార్టీ చేపట్టిన సేవా పక్షం కార్యక్రమం వికారాబాద్ జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం తాండూర్ పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో విశిష్ట వ్యక్తుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు



రాజశేఖర్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర గుప్తా హాజరయ్యారు. ఈ మేరకు తాండూరు నియోజకవర్గం లో వివిధ రంగంలో ఉత్తమ సేవలందిన వారిని బిజెపి పార్టీ గుర్తించి, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో నియోజకవర్గంలో సుమారు 50 మంది విశిష్ట వ్యక్తులకు సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నేతలు మాట్లాడుతూ....

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి. మాజీ అధ్యక్షులు సదానంద రెడ్డి. సీనియర్ బిజెపి నాయకులు మనోహర్ , పెద్దింటి నవీన్ కుమార్, బాలి శివ కుమార్ , జిల్లా ప్రధాన కార్యదర్శిపటేల్ విజయ్ కుమార్. గాజుల శాంతు కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు
సుదర్శన్ గౌడ్ , సాయిరెడ్డి నరేందర్ రెడ్డి. కార్యదర్శి జుంటుపల్లి వెంకటేష్ , మరియు బొప్పి శ్రీహరి , సాహు శ్రీలత దళిత మోర్చా పట్టణ అధ్యక్షులు లాలయ్య , ప్రకాష్ చిదిరి ,కృష్ణ ,కోట్ల నరేందర్ఓబీసీ మోర్చా , మైనారిటీ మోర్చాజహీర్ అబ్బాస్ , ఘనపూర్ వెంకటయ్య సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు

## 42% రిజర్వేషన్లు బోగస్

**ఆ జీవో కోర్టులో నిల్వదు**

**స్థానిక సంస్థల ఎన్నికల పై కాంగ్రెస్ డ్రామా**

**కాంగ్రెస్ బోగస్ హామీల పై**

**బాకీ కార్డులతో ప్రచారం చేస్తాం**

**బీసీలకు న్యాయం జరిగేది ప్రాంతీయ పార్టీలతోనే**

**రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై నిప్పులు చెరిగిన బిసి కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్**





**వికారాబాద్ సెప్టెంబర్ 28,ప్రజావినికిడి**
తెలంగాణ రాష్ట్రంలో బీసీ ప్రజలను బీసీలకు 42 % రిజర్వేషన్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసాలు చేస్తుందని, రిజర్వేషన్ అంతా బోగస్ అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీసభ్యులు శుభప్రద్ పటేల్ నిప్పులు చెరిగారు. ఆదివారం తాండూరు పట్టణంలోని నూలి శుభ ప్రద్ ట్రస్టు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శుభ ప్రద్ పటేల్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ఒక హామీ కూడా నెరవేర్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న బీసీ ప్రజలను 42% రిజర్వేషన్ అని మోసం చేస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ పేరిట ప్రయత్నాలు చేయడం, వద్దని కోర్టు కు వెళ్లడం సాక్షాలు ఉన్నాయని అన్నారు. గత 22 నెలల నుంచి ప్రభుత్వం ఏ ఒక్క ఎన్నికల నిర్వహించకుండా బిసి రిజర్వేషన్ సాకుతో కాలం గడిపిస్తుందని అన్నారు. తమిళనాడు రాష్ట్ర తరహాలో బీసీల రిజర్వేషన్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కానీ అవి అమలు కావడం లేవని అన్నారు. చట్టాలు కానీ జీవోలను ఎలా ఇస్తారని కోర్టు కూడా 42 %బీసీ రిజర్వేషన్ పై కోర్టు ప్రభుత్వం పై మండిపడిందని అన్నారు. బీసీల మనోభావాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం కించపరుస్తుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీల కళ నీరుగారుతోందని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి కానప్పుడు ఆయన అనుచరుడు మదవ రెడ్డి బీసీల రిజర్వేషన్ అని ఆ తర్వాతే ఆయన ద్వారానే జీవోల పై కోర్టుకు వెళ్లడం ఇందుకు సాక్ష్యమని , మాధవ రెడ్డి ఫోటోలను మీడియా ముందు ప్రవేశపెట్టాడు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఇచ్చిన 42 హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చలేరని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదాని కొనియాడిన రాహుల్ గాంధీ ఏ ఒక్కనాడు కూడా పార్లమెంటులో బీసీ రిజర్వేషన్లపై ప్రస్తావించలేదని అన్నారు. బీసీల రిజర్వేషన్ పై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో దీని ద్వారా అర్థం అవుతుందని అన్నారు. ఢిల్లీలో
ఎమ్మెల్యేలు ధర్నా చేస్తే సోనియా గాంధీ రాహుల్ గాంధీ మల్లికార్జున్ కార్గే ప్రియాంక గాంధీ ఎవరు కూడా రాక మద్దతు తెలిపారు లేదని అన్నారు.బీసీలకు న్యాయం చేసేది ప్రాంతీయ పార్టీలే అని అది బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ స్థానిక సంస్థ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల పై కాంగ్రెస్ బాకీ హామీల కార్డుల పేరుతో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసి కాంగ్రెస్ మోసాలను ప్రజల ముందు ఉంచుతామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు భాను, నరేష్ గౌడ్ శ్రీధర్ మనోహర్ తదితరున్నారు

# నీ పాట పంచామృతం..
# మా నోట ఆవిష్కృతం..



## గాన గంధర్వుడు ఎస్పీ బాలు పాటలతో ఆయనకు ఘన నివాళి..

- ఎస్పీ బాలు వర్థంతిని పురస్కరించుకొని గీతాలతో అలరించిన కళాకారులు..
- శ్రీ సరస్వతి కళాపీఠం (ఎస్.ఎస్.కే.పీ) ఆధ్వర్యంలో కార్యక్రమం..
- ఈల పాటలతో అలరించిన “ఈల కోకిల” రోజా మధిర..
- ముఖ్య అతిథిగా హాజరైన టాలీవుడ్ సినీ నటుడు టార్జాన్..
- ప్రత్యేక ఆకర్షణగా షాద్ నగర్ జర్నలిస్ట్ కేపి..
- ఆద్యంతం ఆసక్తిగా స్వరఝరి..



సినీ నటుడు టార్జాన్ హాజరు


సీనియర్ జర్నలిస్టు గాయకుడు కే.పి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ప్రతి ఒక్కరూ అంగీకరించి తీరాల్సిన నిజం..గాన గంధర్వుడు కీర్తిశేషులు ఎస్పీ బాలసుబ్రమణ్యం పాట పంచామృతం.. అందుకే వర్తమాన కళాకారులందరూ ఆయన పాటలనే ఆలపించి ఆయన వర్ధంతికి నివాళులుగా అర్పించారు.బాలు పాడిన అత్యద్భుతమైన తెలుగు,హిందీ పాటలతో అలరించారు.శ్రీ సరస్వతీ కళా పీఠం (ఎస్.ఎస్.కే.పి) ఆధ్వర్యంలో కేపీ హెచ్ బిలో గల ప్రికాస స్టూడియో లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. కళా పీఠం నిర్వాహకురాలు రోజా మధిర,వేణుగోపాల్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలు పాటల పూతోటలో బాలు స్వర సుగందాలను వెదజల్లాయి.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టాలీవుడ్ సినీ నటుడు టార్జాన్.. (లక్ష్మీనారాయణ), విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భావనారాయణ కళాకారులను సత్కరించారు. కళా పీఠం అధినేత్రి రోజా మధిర తన కీల గానంతో శంకర నాదశరీరాపర పాటను అమోఘంగా పాడగా జర్నలిస్ట్,కళాకారుడు ఎండి ఖాజాపాషా (కేపి),శ్రీరామ నీ నామము ఎంతో రుచిరా..అనే భక్తి గీతంతో కార్యక్రమం ప్రారంభించడం విశేషం.

### స్వరాల వరాలు..

ఎన్నిసార్లు విన్న హృదయానందాన్ని కలిగించే ఎస్పీ బాలసుబ్రమణ్యం పాటలను మరోసారి పాడి కళాకారులు అలరించారు.ఈ సందర్భంగా నిర్వాహకురాలు రోజా మధిర ఓంకార నాదాలు సంధానమౌ గానమే శంకరాభరణం..అనే పాటను ఈలపాటగా పాడి అందరినీ ఆశ్చర్యపరిచారు. అదేవిధంగా స్వప్న వేణువేదో పాటను కూడా..ఆమె ఈలపాటగా పాడి ఆకట్టుకున్నారు.ఇక శంకరనాథ శరీరాపర.. అంటూ గొట్టిపాటి రామారావు, పల్లవించవా నా గొంతులో..అంటూ జయప్రభు (జేపీ), ప్రణయ రాగ వాహిని.. అంటూ రామారావు, రత్నకుమారి,ఇంటింటి రామాయణం వింతైన ప్రేమయణం..అంటూ కేపి,రమణి,కలిసే కళ్ళలోన..అంటూ జయప్రభూ,రోజా మధిర,ఒక దేవత గుడిలో అంటూ రత్నా , రామారావు,కురిసింది వాన నా గుండెలోన.. అంటూ జేపీ,రమణి అలరించారు. రామారావు,జెపిల కాంబినేషన్లో ఎన్నాళ్లో వేచిన ఉదయం.. రామారావు,రోజాల ఇందువదన కుందరదన పాటలు ఆకట్టుకున్నాయి.. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి తిరిగి కార్యక్రమాన్ని కొనసాగించారు.దేవీ మౌనమా శ్రీదేవి మౌనమా అంటూ సబితా,జెపి, ప్రియరాగాలే గుండెలోన పొంగుతున్న ఈ వేళ.. అంటూ రామారావు, రోజా,నింగి నేల ఒకటాయనే అంటూ రత్నకుమారి,రామారావు తమ గానామృతాన్ని కొనసాగించారు.ఇక రామారావు,జర్నలిస్ట్ కెపిల ఆధ్వర్యంలో ప్రతి రాత్రి వసంత రాత్రి పాట ఆకట్టుకుంది. అలాగే జర్నలిస్టు కేపీ ప్రత్యేకంగా మైనే ప్యార్ కియా సినిమాలోని మేరే రంగు మే,ఏక్ దూజే కేలియే సినిమాలోని తేరే మేరే బీచ్ మే..లాంటి హిందీ పాటలతో ఆకట్టుకున్నారు. పీపుల్స్ ఎన్కౌంటర్ సినిమాలోని ముక్కలైన రెక్కలతో.. విప్లవ పాట కార్యక్రమానికి హైలైట్ గా నిలిచింది.ఇక అందెల రవళిది పాట కార్యక్రమాన్ని ఆకట్టుకుంది.. నేనీదరిని నువ్వాదరిని.. పాటలతో రామారావు ఆకట్టుకోగా, మొదటిసారి ముద్దు పెడితే,ఊరికి చెప్పకు.. వంటి హుషారైన పాటలతో కేపీ, సబితలు దుమ్ము దులిపారు.

యమగోలలోని ఆడవే అందాల సురభామిని పాటను రామారావుతోపాటు రోజా,రత్న కుమారి, రమణి పాడి మైమరిపించారు.ఇక కేపి,జెపిలు కలిసి పాడిన దళపతి సినిమాలోని సింగారాలపైరులోన పాట కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేపీ తో కలిసి రత్నకుమారి పాడిన నవ్వవే నా చెలి పాట కూడా ఆలరించింది. స్నేహమేరా జీవితం రామారావు పాడి సభలో చప్పట్లు కొట్టించారు.అధ్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో పాటలు పరవశింపజేశాయి. గాన ప్రియులను పులకింపజేశాయి.

### అద్భుతం.. అమోఘం..

బాలు గారి పాటలతో అధ్యంతం అద్భుతంగా, అమోఘంగా పాడి గాయకులు ఆకట్టుకున్నారని సినీనటుడు టార్జాన్ (లక్ష్మీనారాయణ) అన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,కేపీ ఎంత బిజీగా ఉంటారో తనకు తెలుసని అయినా పాటలను విపరీతంగా ప్రేమిస్తాడు కాబట్టి ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి సమయం కేటాయించాడని ప్రశంసించారు.ఇక్కడ అందరూ చిన్న పిల్లల్లా మారిపోయి సంతోషంగా పాటలు పాడుతుంటే ఎంతో ఉల్లాసంగా అనిపిస్తుందని ఆయన అన్నారు. నిర్వాహకురాలు రోజా మధిర పాడిన ఈలపాటనుప్రత్యేకంగా అభినందించారు. తనను సొంత సోదరుడిలా భావిస్తున్నానని ఈ సందర్భంగా తెలిపారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది భావనారాయణ మాట్లాడుతూ, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం పేరిట ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు.గంగిగోపాలు గరిటెడైనను చాలు.. అన్న రీతిలో గాయకులంతా మంచి మంచి పాటలను ఎంపిక చేసుకొని పాడారని ప్రశంసించారు.ఒక పిల్ల కాలువగా మొదలై సప్త సముద్రాలుగా మారిన బాలు ప్రతి గాయకుడికి ఆదర్శమని అన్నారు. జర్నలిస్ట్ కేపీ మాట్లాడుతూ, కళాపీఠం ద్వారా పాడే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.రెండు తెలుగు రాష్ట్రాల కళాకారులను ఒక వేదిక మీదికి తీసుకువచ్చిన ఈ



కార్యక్రమం ప్రశంసనీయమైనదని పేర్కొన్నారు.ఎవరి పాట విని నిత్యం పరవశిస్తామో అలాంటి గానగంధర్వునికి ఈ పాటలను అంకితం చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమానికి తరలివచ్చి పూర్తిస్థాయిలో విజయవంతం చేసిన కళాకారులు అందరికీ నిర్వాహకురాలు రోజా మధిర,వేణుగోపాల్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వేణుగోపాల్,షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టులు కస్తూరి రంగనాథ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభినందనలతో సీనియర్ జర్నలిస్ట్ కేపీ





















ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక


# అక్టోబర్ 2న ఖాదీ వస్త్రాలే ధరించండి

**ఇంటర్నెట్ డెస్క్:** 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులే విక్రయించాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్‌కీ బాత్ 126వ కార్యక్రమంలో ఆదివారం మోదీ మాట్లాడుతూ.. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి.. ధరించాలని కోరారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారన్నారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించిన ప్పటికీ.. గత 11 ఏళ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని అన్నారు. ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని, కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలన్నారు.

**భారత పుత్రికలు ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగలరు..**

భారత నావికాదళానికి చెందిన ఇద్దరు అధికారిణులు, లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూపల ధైర్య సాహసాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. సముద్ర గర్భంలో వారు చూపుతున్న తెగువను కొనియాడారు. భారత పుత్రికలు కఠినమైన పరిస్థితులను సైతం సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. మన్‌కీ బాత్‌లో భాగంగా వారిరువురితో ఫోన్‌లో సంభాషించారు.

**భగత్ సింగ్, లతా మంగేష్కర్‌లకు నివాళి..**

స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ భారతరత్న, ప్రముఖ గాయని లతా మంగేష్కర్ ల జయంతి సందర్భంగా ప్రధాని మోదీ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ



స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ ఉరికంబం ఎక్కారని..దానికి ముందు ఆయన ఆంగ్లేయులకు లేఖ రాశారని అన్నారు. ఇందులో తమను ఉరి కంబాలకు బదులు తూటాలతో చంపాలని భగత్‌సింగ్ కోరినట్లు తెలిపారు. ఆ లేఖ ఆయన సాహసానికి నిదర్శనమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భగత్ సింగ్ ఎప్పుడూ ముందుండే వారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ పాడిన దేశభక్తి గీతాలు ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు. భారతీయ సంస్కృతి, సంగీతంపై ఆసక్తి ఉన్న ఎవరైనా ఆమె పాటలను విని మంత్రముగ్ధులైపోతారని కొనియాడారు.

**ఛత్ పూజకు యునెస్కో గుర్తింపు: ప్రధాని మోదీ**

ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు (సెప్టెంబర్ 28) తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 126వ ఎపిసోడ్‌లో ప్రసంగించారు. ముందుగా ఆయన స్వాంతత్ర్య సమరయోధుడు భగత్ సింగ్‌కు నివాళులర్పించారు. భగత్ సింగ్ ప్రతి భారతీయునికి, ముఖ్యంగా దేశంలోని యువతకు స్ఫూర్తిదాయకుడని అన్నారు. ఉరి తీయడానికి ముందు భగత్ సింగ్.. బ్రిటిష్ వారికి ఒక లేఖ రాశారు. 'నన్ను, నా సహచరులను యుద్ధ ఖైదీలుగా చూడాలని నేను కోరుకుంటున్నాను. అందుకే ఉరితీయడంతో కాకుండా నేరుగా కాల్చి చంపడం ద్వారా మా ప్రాణాలను తీయాలి' అని ఆయన కోరారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. లతా మంగేష్కర్ జయంతి కూడా ఈ రోజే కావడంతో ప్రధానమంత్రి ఆమెను స్మరించుకున్నారు. ఆమె పాడిన దేశభక్తి గీతాలు ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయని అన్నారు. లతా దీదీకి హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నానని పేర్కొన్నారు. ఆమె ప్రతి సంవత్సరం తప్పకుండా నాకు రాఖీ పంపేదని ?ప్రధాని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో ప్రధాని మోదీ లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూపతో సంభాషించారు. ఈ ఇద్దరు ధైర్యవంతులైన అధికారులను ప్రజలకు పరిచయం చేయాలనుకుంటున్నానని అన్నారు. ఛత్ పూజను యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చడానికి భారత ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి మోదీ తెలిపారు. ఛత్ పూజ సూర్య దేవునికి సంబంధించిన పూజ. భక్తులు అస్తమించే సూర్యుని ముందు ప్రార్థనలు చేస్తారని ప్రధాని వివరించారు. ఈ పండుగ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోందన్నారు. ఛత్ పూజ దీపావళి తర్వాత వచ్చే ముఖ్యమైన పండుగ. భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాల కారణంగా, కోల్‌కతా దుర్గా పూజ కూడా యునెస్కో జాబితాలో భాగమైంది. మన సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తే, ప్రపంచం కూడా వాటి గురించి తెలుసుకుంటుందని మోదీ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న కొన్ని ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను కోరారు. గత 11 ఏళ్లలో దేశ ప్రజలలో ఖాదీపై ఆకర్షణ గణనీయంగా పెరిగిందన్నారు. మన చేనేత, హస్తకళల రంగం కూడా గణనీయమైన మార్పులను చూస్తోందన్నారు. ఇదే కార్యక్రమంలో 100 ఏళ్ల ఆర్ఎస్ఎస్ స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ప్రధానమంత్రి మోదీ ప్రశంసించారు. త్యాగం, సేవా స్ఫూర్తి, క్రమశిక్షణ సంఘ్‌కున్న నిజమైన బలమని ప్రధాని అన్నారు. లక్షలాది మంది స్వచ్ఛంద సేవకులు తమ ప్రతి ప్రయత్నంలో దేశం ముందు అనే స్ఫూర్తితో ముందడుగు వేస్తారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## కరూర్ తొక్కిసలాటలో కుట్ర కోణం..

# మద్రాస్ హైకోర్టుకు టీవీకే

తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ జిల్లాలో టీవీకే ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట అంశం రాజకీయరంగు పులుముకుంది. ఈ తొక్కిసలాట వెనుక కుట్ర కోణం ఉందని, స్వతంత్ర దర్యాప్తు జరపాలని టీవీకే మద్రాస్ హైకోర్టు ను ఆశ్రయించింది. ర్యాలీ జరుగుతుండగా కొందరు రాళ్లు రువ్వారని, ఆ వెంటనే పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారని, దాంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని టీవీకే కోర్టుకు తెలిపింది. ఆ గందరగోళ పరిస్థితుల్లోనే తొక్కిసలాట చోటుచేసుకుందని ఆరోపించింది. అందుకే ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోరుతున్నామని సోమవారం మద్రాస్ హైకోర్టులోని మధురై బెంచ్‌లో టీవీకే పిటిషన్ వేసింది. ఘటనపై విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీబీఐకి అప్పగించాలని కోరామని టీవీకే న్యాయవాది అరివళగన్ ఓ వార్తా సంస్థకు చెప్పారు. ఘటనలో కుట్ర కోణం ఉందనేందుకు స్థానిక ప్రజల నుంచి తమకు విశ్వసనీయ సమాచారం ఉందని చెప్పారు. అందుకు సంబంధించి కొన్ని సీసీటీవీ దృశ్యాలు కూడా ఉన్నట్లు తెలిపారు. టీవీకే ర్యాలీలో నిబంధనలను ఉల్లంఘించారంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలను అరివళగన్ తోసిపుచ్చారు. గత రెండు నెలలుగా పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించగా.. ఎక్కడా ఇలాంటి ఘటన చోటుచేసుకోలేదన్నారు. కానీ కరూర్‌లోనే తొక్కిసలాట జరగడంపై సందేహాలు ఉన్నట్లు తెలిపారు. కాగా ఈ తొక్కిసలాటలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికిపైగా గాయపడ్డారు.

కరూర్ కన్నీరు.. హృదయవిదారక దృశ్యాలు





ఊపిరి సలపని పరిస్థితుల్లో ప్రాణాల కోసం పాకులాడిన యువత.. చేతులు జోడించి ప్రాణభిక్ష కోరుతూ ఆర్థించిన వృద్ధురాలు.. తన బిడ్డ కనిపించడం లేదంటూ ఓ తల్లి పడ్డ ఆవేదన.. ఆ పక్కనే పడి ఉన్న ఓ చిన్నారి మృతదేహం.. ఇవన్నీ ఇప్పుడు కరూర్ విషాదాన్ని ప్రపంచానికి చూపిస్తున్నాయి. కరూర్ వెలుచామైపురం టీవీకే ర్యాలీలో ఘోర విషాదం.. 39 మందిని బలిగింది. అనుమతించిన దానికంటే రెట్టింపు సంఖ్యల్లో జనం హాజరు కావడం, వాళ్లను పోలీసులు అదుపు చేయలేకపోవడం, ఆంబులెన్స్‌లకు దారి ఇచ్చే క్రమంలో తొక్కిసలాట జరిగిందని స్పష్టమవుతోంది. ఈ ఘటనకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఇటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అటు టీవీకే పరిహారాలు ప్రకటించాయి. న్యాయపరమైన విచారణ జరుగుతోంది. అదే సమయంలో.. ఈ ఘటనకు సంబంధించిన ఘటన హృదయ విదారక దృశ్యాలు ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. చెల్లాచెదురైన చెప్పులు, టీవీకే జెండాలు అక్కడి పరిస్థితి తీవ్రతను అద్దం పడుతున్నాయి. పరామర్శకు వచ్చిన నేతలకు తన రెండేళ్ల బిడ్డ విగతజీవిగా మారిందని చూపిస్తూ ఓ తండ్రి పెట్టిన రోదన అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది.

## ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం..

## గాజాలో 66 వేలు దాటిన మృతుల సంఖ్య



దాదాపు రెండేళ్లుగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం జరుగుతోంది. అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు ఎదురవుతున్నప్పటికీ హమాస్ రెబెల్స్ లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపడం లేదు. ఈ దాడువల్ల గాజాలో మృతుల సంఖ్య 66 వేలు దాటింది. దాదాపు 1.68 లక్షల మంది గాయపడ్డారు. గాజా ఆరోగ్య శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. మృతుల్లో దాదాపు సగం మంది మహిళలు, చిన్నారులేనని అంచనా వేసింది. శిథిలాల కింద వేల మంది చిక్కుకున్నట్లు భావిస్తోంది. గత 24 గంటల్లోనే 79 మంది మరణించినట్లు తెలిపింది. అయితే మొత్తం మృతుల సంఖ్యలో సామాన్య పౌరులు ఎందరు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదని పేర్కొంది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు మెరుపుదాడులకు పాల్పడటంతో.. హమాస్ నెట్‌వర్క్ అంతమే లక్ష్యంగా అప్పటి నుంచి ఇజ్రాయెల్ గాజాపై విరుచుకుపడుతోంది. ఫలితంగా గాజా జనాభాలో దాదాపు 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు. మరణాలతోపాటు పెద్దఎత్తున విధ్వంసం, మానవతా సంక్షోభం, కరవుతో పరిస్థితులు దుర్భరంగా మారాయి. కొన్నిరోజులుగా గాజా సిటీ లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులను ముమ్మరం చేసింది. మరోవైపు ప్రపంచ దేశాలు నెతన్యాహు సర్కారు తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి. కాగా ఇటీవల ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించాయి.

## భారత్ విషయాల్లో జోక్యం చేసుకోం: రష్యా



**ఇంటర్నెట్‌డెస్క్:** ఈ ఏడాది చివర్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల కు ఆయన హాజరయ్యారు. అనంతరం భారత విలేకరులతో మాట్లాడారు. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారని లవ్రోవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య విస్తృతమైన ద్వైపాక్షిక అజెండా ఉందన్నారు. వాణిజ్యం, సైనిక, సాంకేతికత, కృత్రిమ మేధ వంటి కీలక విషయాల్లో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య జరిగే సాధారణ దౌత్య చర్చల్లో భాగంగా ఈ ఏడాదిలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాస్కోలో పర్యటించే అవకాశం ఉందని, తాను కూడా భారత్‌లో పర్యటిస్తానని తెలిపారు. వాణిజ్యం, ఇంధన సంబంధిత అంశాల్లో భారత్ చర్యల్లో తాము జోక్యం చేసుకోమని లవ్రోవ్ స్పష్టం చేశారు. వీటిపై స్వయంగా నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం ఆ దేశానికి ఉందన్నారు. చమురు వాణిజ్య విధానాలపై భారత వైఖరిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చమురు కొనుగోళ్లపై ఇంతకుముందు జైశంకర్ పేర్కొన్న విషయాలను లవ్రోవ్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా తన చమురును అమ్మాలనుకుంటే.. దీనికి సంబంధించిన నిబంధనలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని జైశంకర్ పేర్కొన్నట్లు తెలిపారు. కానీ, యూఎస్‌తో కాకుండా రష్యా లేదా ఇతర దేశాలతో వాణిజ్యం కొనసాగించడం అనేది తమ సొంత విషయమని ఆయన తెలిపినట్లు వెల్లడించారు. దీనిని ఉదహరిస్తూ భారత్‌కు ఆత్మగౌరవం ఉందని లవ్రోవ్ వ్యాఖ్యానించారు.

## మన వ్యవస్థలోనే ఏదో లోపముంది



**ఇంటర్నెట్ డెస్క్:** కరూర్‌లో సినీనటుడు, టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాట లో 39మంది ప్రాణాలు కోల్పోవడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ విచారం వ్యక్తం చేశారు. దేశంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఇటువంటి ఘటనలు మన వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతున్నాయన్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడాన్ని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమవ్వాలని అన్నారు. ప్రముఖులు నిర్వహించే అన్ని రకాల కార్యక్రమాలకు కఠిన నియమాలను, భద్రతా ప్రోటోకాల్‌లను రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మన దేశంలో జనసమూహ నిర్వహణను అమలు చేయడంలోనే ఏదో తప్పు జరుగుతోందని..అందువల్లే ప్రతి ఏడాది ఏదో ఒక ప్రాంతంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. సాధారణ ప్రజల భద్రత, ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని.. జాతీయ స్థాయిలో ఇటువంటి సభలు, సమావేశాల ఏర్పాటుకు కఠిన నిబంధనలు రూపొందించాలని కోరారు. తమిళనాడు కరూర్‌లో విజయ్ ప్రచార ర్యాలీలో ఈ తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇక్కడ జరిగిన తొక్కిసలాటలో 40 మంది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో విజయ్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.20లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, గాయపడినవారికి రూ.లక్ష పరిహారం అందిస్తామని తమిళనాడు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.

## నా పార్టీ టాప్‌లో లేదా కింద ఉంటుంది




**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ టాప్‌లో లేదా అట్టడుగున ఉంటుందని జన్ సూరజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ తెలిపారు. జేడీ(యూ) 25 కంటే తక్కువ సీట్లు గెలుచుకుంటుందని, బీజేపీ కూడా ఓడిపోతుందని జోస్యం చెప్పారు. ప్రతిపక్ష కూటమి మూడో స్థానానికి పరిమితమవుతుందని అంచనా వేశారు. తన పార్టీ జన్ సూరజ్ 243 సీట్లలో పోటీ చేస్తుందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. అయితే ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదని స్పష్టం చేశారు. తన పార్టీ అగ్రస్థానంలో లేదా దిగువన ఉంటుందని అన్నారు. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అన్నది నాలుగు లేదా ఐదు రోజుల్లో తాను నిర్ణయిస్తానని ఎన్నికల వ్యూహకర్తగా, సలహాదారుగా పనిచేసి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ తెలిపారు. అయితే తన కుటుంబంలో ఎవరూ ఎన్నికల్లో పోటీ చేయబోరని స్పష్టం చేశారు. మరోవైపు సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంపై ప్రశాంత్ కిషోర్ మండిపడ్డారు. జేడీ(యూ) నేత, బీహార్ మంత్రి అశోక్ చౌదరికి పరువు నష్టం నోటీసు పంపుతానని తెలిపారు. రూ. 200 కోట్ల అవినీతికి ఆయన పాల్పడినట్లు ఆరోపించారు. కోట్ల విలువైన ఆ భూమిని తన పీఏ పేరుతో ఆయన ఎందుకు కొన్నారు? అని ప్రశ్నించారు. త్వరలోనే నలుగురు లేదా ఐదుగురు ప్రముఖ నేతల గుట్టు బయటపెడతానని ఆయన అన్నారు.

## 470 మంది పరిశీలకులు

**న్యూఢిల్లీ:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు మరో ఏడు అసెంబ్లీ ఉప ఎన్నికలకు జనరల్, పోలీస్, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులుగా 470 మంది అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారంనాడు నియమించింది. ఎన్నికలు సజావుగా, నిషాక్షికంగా నిర్వహించేలా అధికారులు తమ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. 470 మంది అధికారుల్లో 320 మంది ఐఏఎస్‌లు, 60 మంది ఐపీఎస్‌లు, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్, ఐసీఏఎస్ సర్వీసులకు చెందిన వారు ఉన్నారు. ఎన్నికల పరిశీలకులు బీహార్‌లోని నియోజకవర్గాలతో పాటు బుద్గాం, నగ్రోటా (జమ్మూ అండ్ కశ్మీర్), అంతా (రాజస్థాన్) ఘాట్‌సిలా (జారా?ండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), తరన్ తారన్ (పంజాబ్), డంపా (జార?ండ్), నువాపడా (ఒడిశా)లో మోహరిస్తారు. రాజ్యాంగ నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు పరిశీలకులు సహకరిస్తారని, ఎప్పటికిప్పుడు కమిషన్‌కు రిపోర్ట్ చేస్తుంటారని ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులలో తమకున్న సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో ఎన్నికల సజావుగా జరిగేందుకు వీరంతా ఈసీకి సహకరిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించామని పేర్కొంది. రాజ్యాంగంలోని 324వ నిబంధన, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 20బి కింద తమకు లభించిన ప్లీనరీ పవర్స్‌తో పరిశీలకులను నియమించినట్టు ఈసీ తెలిపింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఈసీ పర్యవేక్షణ, క్రమశిక్షణ కింద వీరు పనిచేస్తారని వివరించింది.

## మళ్లీ భారీ ఎన్‌కౌంటర్..

**రాయపూర్ :** ఛత్తీస్‌గఢ్ - ఒడిశా సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కాంకేర్ జిల్లా దుమార్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాల నుంచి ఆదివారం భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని గమనించిన మావోయిస్టులు.. భద్రతా దళాలపైకి కాల్పులు ప్రారంభించారు. ఈ వెంటనే భద్రతా దళాలు సైతం ఎదురు కాల్పులకు దిగాయి. దీంతో ఇరు వైపులా హోరాహోరీగా కాల్పులు జరిగాయి. కొన్ని గంటల తర్వాత మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు ముందుకు వెళ్లాయి. ఈ కాల్పులు జరిగిన ప్రాంతంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా దళాలు గుర్తించి.. వాటిని స్వాధీనం చేసుకున్నాయి. అలాగే ఈ సంఘటన స్థలంలో కొన్ని ఆయుధాలను సైతం భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆ తర్వాత ఆ ప్రాంతంలో మావోయిస్టుల కోసం కుంబింగ్ ఆపరేషన్‌ను భద్రతా దళాలు చేపట్టాయి. 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా మావోయిస్టుల ఏరివేతకు చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకొంటున్నాయి. దీంతో మావోయిస్టుల్లో పలువురు అగ్రనేతలు సైతం వివిధ సమయాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నెలకొరిగారు. అలాగే వందల మంది మావోయిస్టులు మరణించారు. ఇక పలువురు మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో దాదాపు 71 మంది మావోయిస్టులు.. ఒకే సారి రాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్ట్రం మహారాష్ట్ర, జార?ండ్‌లలో సైతం అడపాదడపా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్న విషయం విదితమే.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక






# ధన పిశాచి వచ్చేస్తుంది..

## సుధీర్ బాబు జటాధర నుంచి సోనాక్షి సిన్హా లుక్ వైరల్

హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా చేసే యాక్టర్లలో ఒకరు టాలీవుడ్ నటుడు సుధీర్ బాబు ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా మేకర్స్ తాజాగా ఈ మూవీ సాంగ్ అప్‌డేట్ అందించారు. ఈ విజయదశమి అక్టోబర్ 1 ధన పిశాచి వస్తుంది. చెడు నయా అవతారాన్ని చూసేందుకు రెడీగా ఉండండి.. అంటూ మేకర్స్ సోనాక్షి సిన్హా పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ చూస్తుంటే ఇందులో సోనాక్షి సిన్హా డబ్బు పిచ్చి ఉన్న వ్యక్తి పాత్రలో కనిపించబోతున్నట్టు తెలుస్తోంది. మొత్తానికి తాజా లుక్‌తో సినిమాపై హైప్ అమాంతం పెంచేస్తున్నారు మేకర్స్. ఇటీవలే ఈ మూవీ నుంచి సోల్ ఆఫ్ జటాధర ట్రాక్ ప్రోమోను విడుదల చేయగా.. ఓం నమ : శివాయ్ అంటూ సాగుతున్న ప్రోమో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్లలో ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టుకున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలో నటిస్తోంది.

# పవర్ స్టార్ మానియా ..

## రెండు రోజుల్లో వంద కోట్ల కలెక్షన్స్ రాబట్టిన ఓజీ



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ లేటెస్ట్ గ్యాంగ్‌స్టర్ డ్రామా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. భారీ అంచనాల నడుమ రిలీజ్ అయిన ఈ సినిమా, తొలి రోజు నుంచే పవర్‌ఫుల్ కలెక్షన్లతో దూసుకెళ్తోంది. అభిమానులు ఎంతగానో ఎదురుచూసిన ఈ చిత్రానికి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ డే ప్రీమియర్స్‌తో కలిపి %టా+% సినిమా వరల్డ్‌వైడ్ ?154 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ నమోదు చేయడం పవన్ కెరీర్‌లోనే సరికొత్త రికార్డుగా నిలిచింది. బిగ్గెస్ట్ ఓపెనింగ్ డే గ్రాస్ కలెక్షన్స్‌లో పవన్‌కి ఇదే అత్యధికం. రెండు రోజుల ఇండియా కలెక్షన్స్ చూస్తే.. ప్రీమియర్స్ కలెక్షన్: ?21 కోట్లు, ఫస్ట్ డే (గురువారం): ?63.75 కోట్లు, సెకండ్ డే (శుక్రవారం): ?19.25 కోట్లు మొత్తంగా 2 రోజుల్లో ఇండియాలో నెట్ కలెక్షన్లు: ?104 కోట్లు.ఈ ఫీటుతో పవన్ తన కెరీర్‌లోనే వేగంగా ?100 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన హీరోగా నిలిచారు. పవన్ కల్యాణ్ క్రేజ్ దేశాన్ని దాటి విదేశాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ఓవర్సీస్ బాక్సాఫీస్ వద్ద %టా+% తొలి రోజు నుంచే 4 మిలియన్ డాలర్ల మార్క్ అందుకొని, రెండో రోజు 4.2 మిలియన్ డాలర్స్ దాటి దూసుకెళ్తోంది. త్వరలోనే 5 మిలియన్ మార్క్ చేరే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. డైరెక్టర్ సుజీత్ పవన్ ఫ్యాన్స్‌కు కావాల్సినటువంటి స్టైల్, యాక్షన్, ఎమోషన్ అన్నీ సమతుల్యంగా మిళితం చేశారు. పవన్ యాక్టింగ్, ఆయన గంభీరత, స్టైల్ స్క్రీన్ మీద చూసి చప్పట్లు కొట్టించేలా ఉన్నాయి. పవర్‌ఫుల్ డైలాగ్స్, ఎలివేషన్స్‌కు ఎస్.ఎస్. తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు గూస్‌బంప్స్ తెప్పించాయి. పవన్ సరసన ప్రియాంక మోహన్ కథానాయికగా నటించగా, విలన్ పాత్రలో ఇమ్రాన్ హష్మీ నటించి మెప్పించారు. ప్రకాష్ రాజ్, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, హరీష్ ఉత్తమన్ ముఖ్య పాత్రల్లో నటించారు.ఈ రికార్డ్ పట్ల సోషల్ మీడియాలో ఫ్యాన్స్ తెగ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "ఇది మాస్ రాంపేజ్%ొ% రికార్డుల మోత" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. "ఇదే పవన్ మ్యానియా అంటూ రచ్చ చేస్తున్నారు.

# ఫ్యామిలీతో కలిసుండట్లే.. సెపరేట్‌గా జీవిస్తున్నా..




మెగా హీరో వరుణ్ తేజ్- లావణ్య త్రిపాఠి ఈ మధ్యే పేరెంట్స్‌గా ప్రమోషన్ పొందారు. ఈ జంటకు మగపిల్లాడు జన్మించాడు. అత్తగా ప్రమోషన్ పొందడంతో నిహారిక ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిహారిక అత్తగా ఫుల్ బిజీ అయ్యానంటోంది. ఆమె మాట్లాడుతూ.. మా అన్నకు కొడుకు పుట్టినప్పటినుంచి నాకెవరూ పనులు చెప్పడం లేదు.

సెపరేట్‌గా ఉంటున్నా..

ఎందుకంటే నేనెప్పుడూ వాడిని ఎత్తుకునే ఉంటున్నాను. లేకపోతే నీళ్ల తీసుకురాపో, ఆ పని చేయి అంటూ ఏదో ఒకటి చెప్తూనే ఉంటారు. వాడు పెద్దయ్యాక యాక్టర్ అవుతానంటే మాత్రం కచ్చితంగా నా బ్యానర్‌లోనే సినిమా తీస్తాను. ప్రస్తుతం నేను సెపరేట్‌గా ఉంటున్నాను. అలా అని కుటుంబానికి దూరంగా ఉండను. రెండురోజులకోసారైనా కచ్చితంగా ఇంట్లోవాళ్లందరినీ కలుస్తాను. ఎందుకంటే వీళ్లే నా జీవితం. హీరోయిన్‌గా సినిమా చేస్తా కుటుంబసభ్యుల ముందుకు వెళ్లానంటే నా ఒత్తిడినంతా మర్చిపోతాను. నా మొదటి సినిమా 'ఒక మనసు'లో నేనంత బాగా నటించలేదు. ఆ మూవీ కోసం నేను చాలా కష్టపడ్డాను. కానీ, అప్పుడు నాకు 20 ఏళ్లే! హీరోయిన్‌గా ఏదైనా మంచి సినిమా ఆఫర్ వస్తే చేయాలనుకుంటున్నాను. ఈ మధ్య వచ్చినవాటిలో మిరాయ్ మూవీ నచ్చింది. ఇటీవలే పుస్తకాలు చదవడం కూడా మొదలుపెట్టాను అని నిహారిక చెప్పుకొచ్చింది.




# 'స్పిరిట్' వైరల్.. ప్రభాస్ తండ్రిగా 'స్టార్ హీరో'!

హీరో ప్రభాస్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'... ఈ ప్రాజెక్ట్ గురించి ప్రకటన వచ్చిన సమయం నుంచి ఎలాంటి వార్త వచ్చినా సరే క్షణాల్లోనే వైరల్ అయిపోతుంది. అయితే, తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది. ఈ మూవీలో ప్రభాస్ తండ్రిగా మెగా హీరో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాలో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో వస్తున్న తాజా నివేదికల ప్రకారం.. స్పిరిట్ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ షూటింగ్ కోసం ఇప్పటికే ఆయన డేట్స్ ఇచ్చారని, ఈ సినిమాలో ప్రభాస్ తండ్రిగా ఆయన కనిపిస్తారని సమాచారం. ఇందులో ఆయన పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని టాక్. సందీప్‌రెడ్డి యానిమల్ సినిమాలో కూడా తండ్రి పాత్రకు చాలా ఎక్కువ ప్రాధాన్యతే ఉంటుంది. ఇదే క్రమంలోనే స్పిరిట్ మూవీలో ప్రభాస్ ఫాదర్ పాత్రకు కూడా ఎక్కువ స్పేస్ ఉంటుందని ఇండస్ట్రీలో ప్రచారం ఉంది. సందీప్ రెడ్డికి ఇష్టమైన నటుడు చిరంజీవి ఆయనతో ఒక ఫుల్ లెన్త్ సినిమా ఛాన్స్ వస్తే చేయాలని ఉందని కూడా చెప్పారు. ఇంతలో ఇలా స్పిరిట్‌లో చిరు భాగమైతే ఆయన సంతోషానికి హద్దులు ఉండవని చెప్పవచ్చు. సందీప్ ఆఫీస్‌తో పాటు తన ఇంట్లో కూడా చిరు ఫోటో ఉంటుంది. అంతలా మెగాస్టార్‌ను సందీప్‌రెడ్డి ఇష్టపడుతాడు. చిరంజీవి కూడా సందీప్, ప్రభాస్ ఇద్దరినీ చాలా ఇష్టపడుతారు. ఈ కాంబినేషన్ సెల్యులాయిడ్‌పై స్థిరపడితే.. ఇంకేముంది బాక్సాఫీస్ కలెక్షన్స్ మోత మోగాల్సిందే.. ఈ కాంబినేషన్ సినిమా వ్యాపారం పరంగా కూడా పాన్ ఇండియా రేంజ్‌లో చాలామందిని ఆకర్షిస్తుంది. అదనంగా, ఈ చిత్రంలో ప్రభాస్, సంజయ్ దత్ అన్నదమ్ములుగా కనిపిస్తారని ప్రచారం కూడా జరుగుతోంది. వారిద్దరూ ఇప్పటికే రాజా సాబ్ కోసం పనిచేస్తున్నారు. ఇప్పుడు, అందరి మనస్సులో వచ్చే పెద్ద ప్రశ్న ఏమిటంటే, చిరంజీవి ఈ చిత్రంలో భాగం కావడానికి ఖచ్చితంగా అంగీకరిస్తారా? ఇదే సందేహం చాలామందిలో ఉంది. నిజమే అయితే, ఫ్యాన్స్‌కు పండగే అవుతుంది. ప్రస్తుతానికి విశ్వంభర, మన శంకర వర ప్రసాద్ సినిమాలతో చిరంజీవి బిజీగా ఉన్నారు. రామ్ చరణ్, సందీప్ కాంబినేషన్‌లో ఒక సినిమా రానుందన కూడా కొద్దిరోజులుగా ప్రచారం ఉంది. అయితే, పెద్ది సినిమా తర్వాత ఈ మూవీ ఉంటుందని టాక్.



# అనుదీప్‌తో సినిమా చేస్తున్నా.. కామెడీ చేయడం చాలా కష్టమైన పని

శ్రీవిష్ణు నటించిన అల్లూరి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది అస్సామీ సుందరి కయాదు లోహర్ . ఈ ఏడాది ప్రదీప్ రంగనాథన్ నటించిన డ్రాగన్ మూవీతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ ముద్దుగుమ్మ జాతిరత్నాలు డైరెక్టర్ అనుదీప్‌తో సినిమా చేస్తుందట. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది. అంతేకాదు కామెడీ చేయడం ఎంత కష్టమో చెప్పింది కయాదు లోహర్. నేను అనుదీప్ డైరెక్షన్‌లో వస్తోన్న ఓ సినిమాలో నటిస్తున్నా. ఈ మూవీ పూర్తిగా కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. సినిమాలోని చాలా డైలాగ్స్ షూటింగ్ స్పాట్‌లో ఆలోచించి రాసినవే. ప్రతీ ఐదు నిమిషాలకోసారి వచ్చే సీన్ కొత్తగా చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. కామెడీ చేయడం చాలా కష్టమైన పని. ఎందుకంటే నేను అనుదీప్ సార్‌తో ఓ సినిమా చేస్తున్నా. కామెడీ చాలా కష్టమని తెలుసుకున్నా. ఎందుకో నాకు తెలియదు కానీ దానికి భాష కూడా ముఖ్యమే. మీకు భాష తెలిసినప్పుడు దాని అర్థమేంటో.. ఆ సంస్కృతి ఏంటో మీకు తెలుస్తుంది. తద్వారా కామెడీ కూడా సహజంగానే వస్తుంది. సంస్కృతితోపాటు ప్రేక్షకుల నాడి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. నాకు నవ్వించే స్వభావం ఉందని నమ్ముతా. కానీ కామెడీ చేయాల్సి వస్తే మాత్రం అది చాలా కష్టమైన పని. అది షూటింగ్ చేసేటప్పుడు చాలా చాలా కష్టంగా ఉంటుంది. ప్రతీ పంచ్ సరిగ్గా వేయాలి.. ప్రతీ టేక్‌ను సరైన విధంగా వచ్చేలా చూసుకోవాలి. కామెడీ అనేది స్క్రిప్ట్‌పై ఆధారపడే కాకుండా స్పాట్‌లో ఆయన (అనుదీప్)చాలా డైలాగ్స్‌తో రాస్తుంటారు. నాకు ఒక డైలాగ్ ఉందంటే మళ్లీ ఐదు నిమిషాల తర్వాత మరో డైలాగ్ వస్తుంటుంది. ఈ సంభాషణలు, కామెడీ ప్రతీ సారి కొత్తగా మారుతూనే ఉంటాయి. ఒక నా భాష (అస్సామీ)లో కామెడీ చేస్తే అంత కష్టం కాదు. కానీ వేరే భాషలో చేయాలంటే చాలా కష్టం అంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ అనుదీప్ కయాదు లోహర్‌ను ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కయాదు లోహర్ 2021లో ముగిల్‌పేట అనే కన్నడ మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మలయాళంలో పాథోన్‌పథం నూట్టుండు సినిమాలో నటించిన ఈ బ్యూటీ అనంతరం శ్రీ విష్ణు సరసన 'అల్లూరి' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మరోవైపు మరాఠీలో కూడా నటించింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613